సీమవార్త

రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4

ఆదివారం 15 నవంబర్ 2026

చదువు ఉంటేనే సర్పంచ్..!!

.....పల్లె రాజకీయాల్లో కొత్త ఒరవడికి జేసీ శ్రీకారం..!!

....విద్య వంతులకే అవకాశం ఇవ్వాలి - జేసీలి

తాడిపత్రి నవంబర్ 14 సీమ వార్త.



పాత రాజకీయాలకు భిన్నంగా, పల్లెల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి సరికొత్త ప్రయత్నం మొదలుపెట్టారు. గ్రామాల అభివృద్ధికి చదువుకున్న యువతే సరైన నాయకత్వం వహించగలరని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, యాడికి, రాయలచెరువు, క్రిష్టిపాడు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన జేసీ, ప్రతి గ్రామంలో యువతతో, పెద్దలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఏం చేయాలన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సంప్రదాయ రాజకీయాలకు దూరంగా, కొత్త ఆలోచనలు ఉన్న యువతకు అవకాశం ఇస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన స్పష్టం చేశారు. కులం, వర్గం చూడకుండా, చదువు, సేవా గుణం ఉన్నవారినే ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. “నేను విద్యావంతులను నిలబెడుతున్నాను.. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి. కొత్తవారిని ఎన్నుకుని గ్రామాల అభివృద్ధికి బాటలు వేద్దాం” అంటూ ప్రజలను కోరారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యలను పరిష్కరించాలంటే విద్యావంతులైన ప్రజాప్రతినిధులు అవసరమని ఆయన అన్నారు. పాత రాజకీయ విధానాలతో గ్రామాలు ఎదగలేవని, ఇప్పుడు మార్పు రావాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. జేసీ పర్యటనకు గ్రామాల్లో మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు మద్దతు తెలుపుతున్నారు. గ్రామాల్లో పాత రాజకీయాలకు భిన్నంగా విద్యావంతులను ప్రజాప్రతినిధులుగా తీసుకురావాలన్న జేసీ ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జేసీకి ఘన స్వాగతం లభించింది. స్థానిక నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పల్లె పోరుకు వ్యూహ రచన..!!

అనంతపురం నవంబర్ 14 సీమ వార్త.

రాప్తాడు నియోజకవర్గంలో జరగనున్న పంచాయతీ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తును మరింత వేగవంతం చేశారు. శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంతో పాటు రామగిరి మండలం వెంకటాపురంలోనూ ఆయా మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశమై చర్చలు జరిపారు. నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, రామగిరి, కనగానపల్లి మరియు చెన్నేకొత్తపల్లి మండలాలలోని పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశాలలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రధానంగా ఆయా పంచాయతీల రిజర్వేషన్లను బట్టి రేసులో ఎవరెవరు ఉన్నారు, క్షేత్రస్థాయిలో ఎవరైతే బలమైన అభ్యర్థి అవుతారు అనే దానిపై ఆరా తీశారు. అంతేకాకుండా గత ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన విధేయత, నాయకుల సీనియారిటీతో పాటు పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువతకు అవకాశం కల్పించే అంశాలపై కూడా చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేలా ఎమ్మెల్యే సునీత దిశానిర్దేశం చేశారు. అంతకుముందు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో రాప్తాడు మండల జడ్పీటీసీగా ఘనవిజయం సాధించిన జయలక్ష్మి అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. - మిగతా3లో

....పంచాయతీ ఎన్నికలపై ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ వ్యూహరచన

....ఆరు మండలాల సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు

....అనంతపురం, వెంకటాపురం క్యాంప్ కార్యాలయాల్లో సుదీర్ఘ సమీక్ష

....రిజర్వేషన్లు, గెలుపు గుర్రాలు, పార్టీ విధేయత, యువతకు ప్రాధాన్యతపై చర్చ

....ఎమ్మెల్యే సునీతను మర్యాదపూర్వకంగా కలిసిన రాప్తాడు జడ్పీటీసీ జయలక్ష్మి







పచ్చని చెట్లకు రక్షణ కరువు..!!

ఫారెస్ట్ అధికారుల అండదండలతో చెలరేగిపోతున్న అక్రమార్కులు అంటూ ఆరోపణలు.

పుట్టపర్తి డెస్క్ నవంబర్ 14 సీమ





పెనుగొండ పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇష్ట రాజన్న పచ్చని చెట్లు నరికివేస్తూ పర్యావరణానికి పలువురు హాని కలిగిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.వైశాలి డాబా వద్ద హైవే పైన ఎటువంటి అనుమతులు లేకుండా పచ్చని చెట్లను కొట్టి అక్రమంగా ట్రాక్టర్లో ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీకు తరలిస్తున్న దాదాపు 7 టన్నుల కలపను పట్టుకుని పెనుకొండ పోలీస్ స్టేషన్ కు ఇటీవల అప్పగించామని దీంతో ఆ ట్రాక్టర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని అయితే అదే రోజే సాయంత్రానికల్లా ఏడు నుంచి ఎనిమిది టన్నుల బరువు కనిపిస్తున్నప్పటికీ సదరు యజమానులతో మాట్లాడుకుని కేవలం అర్ధ తన్నుకు మాత్రమే ఫైన్ వేసి ట్రాక్టర్ను వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై స్పందించిన పర్యావరణ ప్రేమికులు మాట్లాడుతూ సోమందేపల్లి హైవేపై ఉన్న ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ కు ప్రతిరోజు 5 నుండి 10 ట్రాక్టర్ల ద్వారా ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్కు 7 టన్నులు వేసుకున్న దాదాపు 70 టన్నుల అక్రమ కలప వినియోగం జరుగుతోంది దీనిపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా స్క్వాడ్ డి ఎఫ్ ఓ మామూళ్ళ మత్తులో మునిగి చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నని ఆరోపిస్తున్నారు. పర్యావరణాన్ని ప్రేమించే మాలాంటి వ్యక్తులు ప్రాణాలకు తెగించి అక్రమ కలపను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని అప్పగిస్తే వారు చేసిన పని అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు అక్రమార్కులను కొమ్ముకాస్తూ 7 టన్నుల కలప కంటి ముందు కనిపిస్తున్న కేవలం అర్ధ తన్నుకు మాత్రమే ఫైన్ ఎలా వేస్తారని ప్రశ్నించారు దీనిపై పై అధికారులు సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వికసిత్ భారత్‌కై.... యూత్ మైండ్ సెట్ పెరగాలి..!!

.....జేఎన్‌టీయూఏలో ఘనంగా వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్ జిల్లా స్థాయి పీపీటీ ప్రెజెంటేషన్ పోటీలు



అనంతపురం: నవంబర్ 14 సీమ

భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ -- అనంతపురం, ఆన్సెట్ సంయుక్త ఆధ్వర్యంలో జేఎన్‌టీయూఆర్యభట్ట ఆడిటోరియంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో భాగంగా జిల్లా స్థాయి వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్ పీపీటీ ప్రెజెంటేషన్ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ ఏ. మాలోల, జేఎన్‌టీయూ ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన్ రావు, జిల్లా పర్యాటక అధికారి శ్రీ రమణ రెడ్డి, ఆన్సెట్ సీఈఓ శ్రీ ఎన్. రవిశంకర్ రెడ్డి, మేరా యువ భారత్ ప్రతినిధి శ్రీ బిసాతి భరత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. జి. మమత, ఆన్సెట్ మేనేజర్ శ్రీ సి. శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీ బిసాటి జీవన్ కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని - మిగతా3లో

వైభవంగా విజయాంబిక సమేత భైరవలింగేశ్వర స్వామి

స్వర్ణోత్సవ మహోత్సవాలు ప్రారంభం

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..

50వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక సందడి





యాడికి, నవంబర్ 14 (సీమ వార్త) యాడికి గ్రామంలోని కొండపై వెలసిన శ్రీ విజయాంబిక సమేత భైరవలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వర్ణోత్సవ (50వ సంవత్సరం) మహోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మహాసంప్రోక్షణ, మహాకుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ మహత్తర ధార్మిక కార్యక్రమాలు నవంబర్ 14వ తేదీ శనివారం ప్రారంభం కాగా, నవంబర్ 16వ తేదీ సోమవారం ప్రధాన ఘట్టమైన మహాసంప్రోక్షణ, మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఐదు దశాబ్దాల ఆలయ ప్రస్థానానికి గుర్తుగా నిర్వహిస్తున్న ఈ స్వర్ణోత్సవ వేడుకలు యాడికి గ్రామ ప్రజల్లో, శివభక్తుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు ఆలయానికి విచ్చేస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పూలమాలలు, అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆలయంలో సంప్రదాయబద్ధంగా వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ జరిగే పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు భక్తిమయంగా మారనున్నాయి. 16న మహాకుంభాభిషేక మహోత్సవం ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం 10.20 గంటల నుంచి 10.45 గంటల మధ్య నిర్ణయించిన పవిత్ర ముహూర్తంలో శ్రీ విజయాంబిక సమేత భైరవలింగేశ్వర స్వామి వారి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ ప్రధాన కార్యక్రమానికి సంబంధించి ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో యాడికి గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు. 50 సంవత్సరాల ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ స్వర్ణోత్సవ మహోత్సవాలు యాడికి గ్రామ చరిత్రలో ప్రత్యేక గుర్తింపుగా నిలవనున్నాయని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

మధుమేహ నియంత్రణకు జీవనశైలిలో మార్పులు అవసరం



ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతోందని ఉప జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీత తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం శ్రీరాములపేట సచివాలయంలో ప్రజలకు ఆరోగ్య అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ కనీసం అరగంట నడక లేదా వ్యాయామం చేయడం, పోషక విలువలున్న సమతుల్య ఆహారం తీసుకోవడం, శరీర బరువును నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా మధుమేహాన్ని నివారించవచ్చన్నారు. తీపి పదార్థాలు, జంక్‌ఫుడ్, మద్యపానం, పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. రక్తంలో చక్కెర స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే గుండె, మూత్రపిండాలు, కంటి చూపు, నరాలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స పొందాలని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఎన్‌సీడీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ భరత్ నారాయణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలతోనే బాలల భవిష్యత్తుకు బంగారు బాట



ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: విద్యార్థుల్లో విజ్ఞానం, ఆలోచనా శక్తి, నైతిక విలువలు పెంపొందించడంలో పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత డి.కె. చదువులబాబు అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పుస్తకాలు చదవడం వల్ల భాషా నైపుణ్యాలు, లోకజ్ఞానం, మంచి చెడులపై అవగాహన, మానసిక పరిపక్వత పెరుగుతాయని, విద్యార్థులు పఠనాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. సభాధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోపీనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, కవి గజ్జల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తాను 1,111 మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం కల్పించానని, వారంతా పుస్తక పఠనం ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలల వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంపై వ్యాసరచన పోటీ నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు, ఉపాధ్యాయుడు చాడా మునిశేఖరరెడ్డి జవహర్‌లాల్ నెహ్రూ జీవితంలో పుస్తక పఠనం, నిరంతర కృషి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన పాటలు అలరించాయి. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, హెల్పర్ నాగలక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానంతో ఐదేళ్లుగా చల్లా రాజగోపాల్ యాదవ్ సేవా నిరతి



ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: పట్టణంలో సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ గత ఐదేళ్లుగా ప్రతి శనివారం, పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద అన్నదానం చేపట్టి ప్రయాణికులు, పేదలు, వృద్ధులు, కార్మికులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఐదేళ్లుగా క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నామని తెలిపారు. పేదలకు సేవ చేయడంలో కలిగే సంతృప్తి మరెందులోనూ లభించదని, ఈ సేవా కార్యక్రమాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, నల్లం రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతర నిఘా.. ట్రాఫిక్ పోలీసులకు డీఎస్పీ దిశానిర్దేశం



ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలని ప్రొద్దుటూరు డీఎస్పీ ఈ. బాలస్వామిరెడ్డి సూచించారు. వార్షిక పోలీస్ స్టేషన్ తనిఖీల్లో భాగంగా శనివారం ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది విధులు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తూ ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. భాస్కర్, ఎస్ఐ ఎం. భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో మానవత్వం చాటిన ట్రాఫిక్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా



ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: అత్యవసర పరిస్థితుల్లో రక్తహీనతతో బాధపడుతున్న రాజేశ్వరి అనే మహిళకు రక్తదానం చేసి ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ ఎస్.పి. మహబూబ్ బాషా మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమనే విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ భాస్కర్ వెంటనే స్పందించి సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో మహబూబ్ బాషా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి మహిళకు సహాయం అందించారు. ప్రజల రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు సామాజిక బాధ్యతలోనూ భాగస్వాములవుతూ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. తక్షణమే స్పందించిన ట్రాఫిక్ సీఐ భాస్కర్, రక్తదానం చేసిన కానిస్టేబుల్ మహబూబ్ బాషాకు అభినందనలు తెలిపారు.

నూతన దేవాలయం ప్రారంభోత్సవం.



పెనుకొండ నవంబర్ 14 సీమవార్త. పట్టణంలోని మైన్ బజార్ లో ఉన్న శ్రీ వ్యాసరాజమఠం శిలామయమైన స్థానంలో ఆదివారం నూతన దేవాలయ ప్రారంభోత్సవం ప్రాణదేవుని పునఃప్రతిష్ట చేయనున్నారు.ఉదయం పునఃప్రతిష్ట హోమాలు,వాస్తుశాంతి జరిపారు.అలాగే ఆదివారం లక్ష్మి కాంత తీర్థులు మూల బృందావనం సన్నిధి లో సంస్థాన పూజ,ప్రతిష్టాంగ హోమాలు, కుంభాభిషేకం చేయుదురు. అనంతం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



సొమందేపల్లి నవంబర్ 14 సీమ వార్త సొమందేపల్లి నందు 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ 137 వ జయంతి, పిల్లల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయుడు చనప్ప మాట్లాడుతూ అయన భారతదేశనికి తొలి ప్రధానిగా చేసిన సేవలను గురించి విధ్యార్థులకు వివరించడం జరిగినది చివరగా పిల్లలతొ గ్రాంథాలయ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు చనప్ప గ్రంథాలయ అధికారి కె.మహబూబ్ భాషా, పాఠశాల విధ్యార్థిని,విధ్యార్థులు,గ్రాంథాలయ పాఠకులు మరియు మండల ప్రజలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పట్టణంలోని ఏబీఎం పాఠశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల, ఉన్నత పాఠశాల వసతి గృహాల విద్యార్థినులకు డాక్టర్ కటారు మానస దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేస్తున్నామని, ముఖ్యంగా రాత్రివేళల్లో తప్పనిసరిగా వాటిని వినియోగించాలని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించి ఉజ్వల భవిష్యత్తును సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి సాధు శ్రీనివాసులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, సీఓ ఎం.వి. సుబ్బారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, జయపాల్, వార్డు హెల్త్ సెక్రటరీ పద్మావతి, ఆశా కార్యకర్తలు పిల్లి పుష్పకుమారి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, నవంబర్ 14, సీమవార్త: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పట్టణంలోని ఏబీఎం పాఠశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల, ఉన్నత పాఠశాల వసతి గృహాల విద్యార్థినులకు డాక్టర్ కటారు మానస దోమతెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేస్తున్నామని, ముఖ్యంగా రాత్రివేళల్లో తప్పనిసరిగా వాటిని వినియోగించాలని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించి ఉజ్వల భవిష్యత్తును సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి సాధు శ్రీనివాసులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, సీఓ ఎం.వి. సుబ్బారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, జయపాల్, వార్డు హెల్త్ సెక్రటరీ పద్మావతి, ఆశా కార్యకర్తలు పిల్లి పుష్పకుమారి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

పులివెందుల డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్



పులివెందుల నవంబర్ 14 (సీమ వార్త) కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాల దర్శనం చేసుకునే భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పులివెందుల డిపో నుండి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మీడియా ద్వారా డిపో మేనేజర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ పరిధిలో ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన భాను కోట, భైరవేశ్వర స్వామి, పొలతల క్షేత్రం, పార్నపల్లి కోన మల్లేశ్వర స్వామి మరియు మోపురి దేవాలయాలను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేపట్టనున్న నేపథ్యంలో భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సౌకర్యవంతంగా పుణ్యక్షేత్రాలను సందర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని కావున పులివెందుల పరిసర ప్రాంతాల ప్రజలు శివ భక్తులు, అయ్యప్ప భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, యాత్రలకు సంబంధించిన పూర్తి వివరాలు బస్సులో ఏర్పాటు మరియు ఇతర సమాచారం కోసం పులివెందుల ఆర్టీసీ డిపోను సంప్రదించాలని, కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లే భక్తులకు ఆర్టీసీ అందిస్తున్న ఈ ప్రత్యేక రవాణా సౌకర్యం ఉపయోగకరంగా ఉంటుందని డిపో అధికారులు తెలియజేశారు.

చివరి ఆయకట్టు భూములకూ సాగునీరు అందేలా పర్యవేక్షణ



రాజుపాలెం, నవంబర్ 14, సీమవార్త: రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న సాగునీరు రైతుల పంట పొలాలకు సక్రమంగా చేరేలా మైలవరం రిజర్వాయర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ భూతురు జయరామిరెడ్డి, మైలవరం కెనాల్ ఏఈ హనుమంతరెడ్డి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైలవరం రిజర్వాయర్ నుంచి రాజుపాలెం మండలంలోని కుందూ నదికి చేరుతున్న నీటి ప్రవాహాన్ని తనిఖీ చేశారు. కాలువల్లో నీరు వృథా కాకుండా, ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు చేపట్టారు. స్లూయిస్‌లను పరిశీలిస్తూ సాగు చేసిన పంటలు ఎండిపోకుండా ఆయకట్టులోని చివరి భూముల వరకు నీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని వారు తెలిపారు.

బాలల భవిష్యత్తుకు నెహ్రూ ఆశయాలే మార్గదర్శకం



ప్రొద్దుటూరు, నవంబర్ 14, (సీమవార్త): భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ సింధూర, డాక్టర్ భరత్ నారాయణ, రాష్ట్రీయ సేవా సమితి మానసిక దివ్యాంగుల శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ ఝాన్సీ లక్ష్మీభాయ్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి, విద్యా విజ్ఞాన రంగాల పురోగతికి నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బాలలంటే ఆయనకు ఎంతో ప్రేమని, పిల్లలే దేశ భవిష్యత్తు అని విశ్వసించేవారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ టీడీ వరుణ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ బాలలకు నాణ్యమైన విద్యతోపాటు సమాన అవకాశాలు కల్పించడమే నెహ్రూకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం ఝాన్సీ లక్ష్మీభాయ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి డి.భాస్కర్ రావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా వారాది మధు, నాగరాజు, బి.వి.ప్రసాద్, కె.పి.ఓబుల రెడ్డి, గడ్డం రాజు, జింకా శేఖర్, రామ సుబ్బారెడ్డి, రామిరెడ్డి, మురళి, నాగేంద్ర, బాబా, లక్ష్మణ్, ఎస్ఎస్ఏ గురివిరెడ్డి, నడిగడ్డ సుధాకర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన. అడిషనల్ ఎస్పీ అంకిత సురానా.



ముదిగుబ్బ నవంబర్ 14 సీమ వార్త గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు, ప్రచారం, పోలింగ్ తదితర ప్రక్రియలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని అడిషనల్ ఎస్పీ అంకిత సురానా కోరారు. శనివారం మండల పరిధిలోని ముదిగుబ్బ, పట్నం, రామస్వామి తండా లలోని గ్రామ సచివాలయాల వద్ద ఆదివారం నిర్వహించనున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను బందోబస్తును వసతులను పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలిపారు, పోలింగ్ కార్యక్రమానికి హాజరయ్యే ఓటర్ల భద్రత, వసతుల కల్పన పై అధికారులకు పలు సూచనలు అందించారు, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులతో పాటు మరో ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్ కేంద్రాలలోకి అనుమతి ఇవ్వడం జరుగుతుందని, కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు, ప్రచారాలు నిర్వహించరాదని, గుంపులుగా చేరడం నిషేధమని తెలిపారు, నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, పర్యవేక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు, రోడ్ల ద్వారా నిఘా కొనసాగించడం జరుగుతుందని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు, ఎన్నికల నియామాలని ఉల్లంఘించిన శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు, ఈ కార్యక్రమంలో హిందూపురం డిఎస్పి రవిబాబు, ముదిగుబ్బ రూరల్ సీఐ సునీత, పట్నం ఎస్సై మహమ్మద్ హర్షద్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు కవి కాకి కోగిర జై సీతారామ్.

:-చైర్మన్ త్రివేంద్రమూర్తి.



పెనుకొండ నవంబర్ 14 సీమవార్త.తన కలంతో ఎన్నో భావాలను అక్షరాలుగా మలిచి, కవితా ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన కవి కాకి కోగిర జై సీతారాం మహోన్నత వ్యక్తి అని మున్సిపల్ చైర్మన్ త్రివేంద్రమూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని అఫిషియల్ క్లబ్ లో సుగుణ సోవిధిని కవి కాకి కోగిర జై సీతారాం ట్రస్ట్ ఆధ్వర్యంలో పువిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో కవితలు రచించిన కవి కాకి కోగిర జై సీతారామ్ ఈ ప్రాంతంలో పుట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. కవి పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అతను రచించిన కవితలను పుస్తక రూపంలో విడుదల చేయడం పెనుకొండ కే గర్వకారణం అన్నారు.మన ప్రాంతంలో ఇలాంటి కవులను వెలికి తీయాలన్నారు.అనంతరం పలువురు కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాధవ నాయుడు, కోగిర జయచంద్ర, కోనాపురం ఈశ్వరయ్య, కేశవయ్య, సుమనజయంతి తదితరులు పాల్గొన్నారు.

సూర్య హై స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



ధర్మవరం రూరల్ నవంబర్ 14 సీమ వార్త : సూర్య హై స్కూల్ విద్యార్థులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సాయినానగర్ లో గల సూర్య హై స్కూల్ లో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవన్ని పురస్కరించుకొని సిద్దయ్యగుట్ట నందు గల తిక్కనారాయణస్వామి గుడిలో వృద్ధులు లకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండంట్ వై.నరేంద్రబాబు, డైరెక్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం జ్యోతి,సునీత, పద్మ,అక్కంబి,జ్యోతి, జాహ్నవి పాల్గొన్నారు.ప్రతిసంవత్సరం బాలల దినోత్సవం రోజున విద్యార్థుల ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది అని నరేంద్ర బాబు తెలిపారు.

అంగన్వాడీ లో న్యూమోనియాపై అవగాహన



టి సుండుపల్లె నవంబర్ 14 సీమ వార్త మండలంలోని పెద్దినేనికాల్వ గ్రామం తోటిమాలపల్లె అంగన్వాడీ కేంద్రంలో డాక్టర్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో న్యూమోనియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకు న్యూమోనియా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య చికిత్స అందించాలని, వ్యాధి నివారణకు పీసీవీ టీకా వేయించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ, ఏఎన్ఎంలు మెహరన్ బీ, అమరావతి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం పెడితే రూ.25 లక్షల సబ్సిడీ పౌల్ట్రీ పాలసీకి ప్రభుత్వం ఆమోదం



తాడిపత్రి నవంబర్ 14 సీమ వార్త: కోళ్ల ఫారం ఏర్పాటు చేయాలనుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29 కు ఆమోదం తెలుపుతూ జీఓఎంయస్.నెంబర్.20 విడుదల చేసింది. ఈ పాలసీ కింద కొత్తగా అత్యాధునిక కోళ్ల ఫారాలు నిర్మించే వారికి రూ.25 లక్షల వరకు పెట్టుబడి సబ్సిడీ లభిస్తుంది. ఇప్పటికే ఉన్న ఫారాలను ఆధునికీకరించే వారికి రూ.20 లక్షల వరకు సాయం అందనుంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు 50 శాతం సబ్సిడీతో మదర్ పౌల్ట్రీ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అర్హత కలిగిన రుణాలపై వడ్డీ రాయితీ, విద్యుత్ వినియోగంపై ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా ఇవ్వనున్నారు. తాడిపత్రి ప్రాంతానికి మంచి అవకాశం అనంతపురం జిల్లాలో ఇప్పటికే పౌల్ట్రీకి మంచి డిమాండ్ ఉంది. తాడిపత్రి చుట్టుపక్కల గ్రామాల్లో చాలా మంది రైతులు పౌల్ట్రీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పాలసీతో యువతకు సొంత ఉపాధి దొరకడమే కాకుండా, గ్రామాల్లో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఆధునిక ఫారాల్లో వ్యాధి నివారణ వ్యవస్థను బలోపేతం చేయడం, శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకం, నాణ్యమైన గుడ్లు, మాంసం ఉత్పత్తి చేయడం ఈ పాలసీలో ముఖ్య భాగంగా ఉంది. మొత్తం రూ.657.18 కోట్ల ఆర్థిక ప్యాకేజీతో ఈ పాలసీని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పాలసీ 2026 సెప్టెంబర్ 3 నుండి 2029 అక్టోబర్ 25 వరకు అమల్లో ఉంటుంది. "పౌల్ట్రీ అంటే కేవలం వ్యాపారం కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం. యువత, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సొంత వ్యాపారం పెట్టుకోవాలి" అని అధికారులు సూచించారు. ఆసక్తి ఉన్నవారు దగ్గరలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో లేదా సచివాలయంలో సంప్రదించి అర్హత, దరఖాస్తు విధానం తెలుసుకోవచ్చు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



సంబేపల్లి నవంబర్ 14సీమ వార్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, దేవపట్లలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కిచెన్ గార్డెన్ అభివృద్ధికి ఉత్సాహంగా కృషి చేసిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేసింది. మొక్కల పెంపకం, ప్రకృతి ప్రేమ, పరిశుభ్రత, బాధ్యతాయుతమైన అలవాట్లను విద్యార్థుల్లో పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారి వేణుగోపాలస్వామి



గుంతకల్ నవంబర్ 14 సీమా వార్త గుంతకల్ కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా పట్టణంలో గల స్థానిక హనుమాన్ సర్కిల్ వద్ద ఉన్న అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో, పూజారి వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఉదయం 4:30 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అనంతరం తమలపాకులతో అర్చన, తులసీమాలను స్వామికి ధరించి, మరియు వివిధ పుష్పాలతో స్వామివారిని అలంకరించడం జరిగింది. అనంతరం కర్ణాటక రాష్ట్రం, వివిధ జిల్లాల నుంచి, మాలా ధరించిన స్వాములు, భక్తులు వందల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి మాట్లాడుతూ కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా, వందల సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారని, మరియు ప్రతిరోజు వివిధ రాష్ట్రాల నుంచి, స్వామి వారిని దర్శనానికి వస్తుంటారని, మరి ముఖ్యంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఉండాలని ఆ దేవుని మనసారా కోరుకుంటున్నా నూ అన్నారు, ఈ పూజా కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు, కోటిరెడ్డి, మరియు భక్తులు, డాక్టర్ రామ్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవ వేడుకల్లో కిచెన్ గార్డెన్ ప్రారంభం



లేపాక్షి, నవంబర్ 14సీమా వార్త : లేపాక్షి మండలం నాయనిపల్లి క్రాస్‌లోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్ (ఎన్ జెడ్ హెచ్ సి) కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నూతన కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. పాఠశాల ఆవరణలోనే కూరగాయల తోటను ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో వ్యవసాయంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రకృతిని కాపాడుకోవాలనే బాధ్యతను అలవర్చవచ్చని నిర్వాహకులు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి. మధుసూదన రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీ జి. ఆర్. హరీష్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముదిగుబ్బలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం

విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి : మండల విద్యాధికారి వెంకటరమణప్ప



ముదిగుబ్బ నవంబర్ 14 సీను వార్త మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి వెంకటరమణప్ప హాజరయ్యారు. తొలుత భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వెంకటరమణప్ప మాట్లాడుతూ విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి పెంపొందుతాయని తెలిపారు. గ్రంథాలయ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న ప్రముఖుల గురించి ప్రసంగాలు, 17న సెమినార్లు, 18న విద్యార్థులకు వివిధ అంశాల్లో ఆటల పోటీలు, 19న మహిళా దినోత్సవ కార్యక్రమం, 20న ముగింపు వేడుకలతో పాటు విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఖాదర్ భాష, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన మండల వైద్యాధికారినీ



ముదిగుబ్బ నవంబర్ 14 సీమ వార్త ముదిగుబ్బ మండల కేంద్రంలోని బిసి బాలికల వసతి గృహంలో శనివారం నాడు మండల వైద్యాధికారిని శ్వేత బాలవివాహాలపై ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపల పిల్లలకు శారీరక మానసిక, ఎదుగుదల ఉండదు విరు వివాహం చేసుకున్నచో టీనేజ్ గర్భం దాల్చితే రక్తహీనత, కాన్పు సమయంలో అనారోగ్య సమస్యలు ఎదురయితాయని ఆమె తెలియజేశారు. 14 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలు లోపల ఉన్న ప్రతి ఆడపిల్ల న్ూఎ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆమె సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే దోమకాటువలన మలేరియా డెంగ్యూ, వంటి జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఓ మక్బుల్, ఎంపీహెచ్ఎస్ఎఫ్ కావేరి, అంజలి, ఎమ్మెల్ హెచ్పిఎస్ శివమ్మ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం





పులివెందుల నవంబర్ 14 (సీమ వార్త): పులివెందుల పట్టణ పరిధిలోని గ్రంథాలయంలో శనివారం 59వ జాతీయ గ్రంథాలయ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా గ్రంధాలయంలో శ్రీ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. అలాగే 14 వ తేది నుండి20 వ తేది వరకు జరుగు గ్రంధాలయ వారోత్సవాలు పాంప్లెట్స్ విద్యార్థులు చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి, లైబ్రరీ హెల్పర్ లక్ష్మీ నరసమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం....



గాండ్లపెంట నవంబర్ 14 సీమ వార్త..... త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ భాగంగా మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం పోలింగ్ అధికారులకు ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిప్యూటీ ఎంపీడీవో ఆనందయ్య, ఉపాధ్యాయుడు సూర్య శేఖర్ మండలంలోని 111 మంది పోలింగ్ అధికారులకు పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహణ, ఓటింగ్ ప్రక్రియ, బ్యాలెట్ పత్రాల వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలు, పోలింగ్ ప్రారంభానికి ముందు చేయాల్సిన ఏర్పాట్లు, ఓటింగ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ మిషన్ అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియల గురించి అధికారులకు సూచనలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిబంధన ప్రకారం విధులు నిర్వహించాలని ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి సమన్వయంతో పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి



మదకశిర నవంబర్ 14 సీమ వార్త ఆంధ్రప్రదేశ్ ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన, సోనియా గాంధీ రచించిన "బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్" పుస్తక పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న సీడబ్ల్యుసి సభ్యులు మాజీమంత్రి రఘువీరారెడ్డి.
ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సిసభ్యులు డాక్టర్ ఎన్. రఘువీర రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య , సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావు , అలాగే గొల్ల నారాయణ రావు, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మనోహర్ నాయుడు గారు అధ్యక్షత వహించారు. సోనియా గాంధీ స్ఫూర్తిదాయక ప్రయాణం, విలువలు మరియు అనుభవాల గురించి చర్చించుకోవడానికి ఇది ఒక అద్భుతమైన సందర్భం. అని తెలిపారు.సర్పంచ్ గా ప్రజలు గెలిపిస్తే గ్రామపంచాయతీ అభివృద్ధి నా ధ్యేయం... ఓటర్లు ఆదరిస్తే పంచాయతీ లోని గ్రామాలను చక్కదిద్దుతాసిద్ధ రమాదేవి....
నంబులపూలకుంట: నవంబర్ 14 (సీమవార్త): నంబులపూలకుంట మండలం మర్రి కొమ్మదిన్నె పంచాయతీ గ్రామ సర్పంచ్ గా గంగినాయినపల్లికి చెందిన సిద్ధ రమాదేవికి పంచాయతీ పరిధిలోని ఓటర్లు ఆదరిస్తే గ్రామాల అభివృద్ధి చేసి చూపిస్తామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మర్రికొమ్మ దీన్నే పంచాయతీ సర్పంచ్ గా సిద్ధ రమాదేవి పోటీకి సిద్ధమయ్యారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిద్ధ రమాదేవి కచ్చితంగా పోటీ చేసేందుకు అన్ని సన్నాహాలు సిద్ధం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ ప్రజలు జరగబోయే ఎన్నికల్లో తన ఓట్లు వేసి గెలిపించి నట్లయితే ప్రజా సమస్యల పైన ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం మార్గం చూపుతామన్నారు. ప్రధానంగా గ్రామాలలో నెలకొన్న తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, మురుగునీరు, వీటితోపాటు పలు సమస్యలను పరిష్కరించే దశగా ముందుండి ప్రజలకు పరిష్కారం చూపుతామని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ పరిధిలో ఓటర్లు మీ ఆశీస్సులతో అందరు మమేకముతో ఎన్నికల్లో తమకు ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి



డి.హీరేహాల్ (సీమవార్త): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కళ్లెం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరూ గొడవలకు, వివాదాలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

తుమ్మ చెట్లను నరికి కలపను తరలిస్తున్న వాహనం సీజ్.

పెనుకొండ నవంబర్ 14 సీమవార్త. రొద్దం మండలం, తురకలాపట్టం చెరువు వద్ద అక్రమంగా తుమ్మ చెట్లను నరికి కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. అటవీక్షేత్రాధికారి మదన్ మోహన్,అటవీ సెక్షన్ అధికారి రాహుల్, బీట్ అధికారి శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని, అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి పెనుకొండ అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ, అటవీ సంపదను అక్రమంగా నరికివేయడం, కలపను అక్రమంగా రవాణా చేయడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలి.

డి.ఎస్.పి రవిబాబు.



ముదిగుబ్బ నవంబర్ 14 సీమ వార్త ప్రస్తుతం నిర్వహిస్తున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు, ప్రత్యేకించి సమస్యాత్మకకేంద్రాల వద్ద ఎటువంటిఅవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, జరగకుండా ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేలా పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని హిందూపురం డి.ఎస్.పి రవిబాబు సిబ్బందికి మార్గం నిర్దేశం చేశారు. శనివారం స్థానిక అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్ లో ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి ఆయన ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన బందోబస్తు, ఓటర్లు, అభ్యర్థులకు ఎటువంటి అవాంతరాలు కలగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలు, ప్రచారం సందర్భంగా అనుచరించాల్సిన విధానాల గురించి వివరించారు, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారి పై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు, ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అనుమానాస్పద వ్యక్తులు సంచారాలను గుర్తించిన ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ అప్గ్రేడ్ సీఐ రామసుబ్బయ్య, జయ నాయక్, ముదిగుబ్బ పట్నం ఎస్ ఐ లు కేతన్న, మహమ్మద్ హర్షాద్ పలువురు పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రిలో సోలార్ విప్లవం.. ఇంటింటా సోలార్ ప్యానెల్స్!

ఎండను డబ్బుగా మార్చుకుంటున్న తాడిపత్రి వాసులు!



తాడిపత్రి నవంబర్ 14 సీమ వార్త: నెల నెలా పెరుగుతున్న కరెంట్ బిల్లులతో విసిగిపోయిన తాడిపత్రి ప్రజలు ఇప్పుడు సోలార్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ వేసుకుంటే బిల్లు భారం తగ్గడమే కాకుండా, ప్రభుత్వ సబ్సిడీ కూడా లభిస్తుండటంతో చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో తాడిపత్రిలోని గ్రీన్ గ్రిడ్ సోలార్ సంస్థ ప్రజలకు అందుబాటు ధరలో సోలార్ సిస్టమ్ అందిస్తోంది. 3కె సోలార్ సిస్టమ్ మొత్తం ఇన్స్టాలేషన్ ధర రూ.1,78,000 కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.78,000 పోను వినియోగదారులు చెల్లించాల్సింది కేవలం రూ.1,00,000 మాత్రమేనని సంస్థ నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా నెలకు 300 యూనిట్ల వరకు వాడే కుటుంబాలకు 3కె సిస్టమ్ సరిపోతుందని, దీంతో కరెంట్ బిల్లు దాదాపు సున్నాకు చేరుతుందని చెబుతున్నారు. అన్ని బ్రాండ్స్ ప్యానెల్స్, బ్రాండెడ్ ఇన్వర్టర్లు, ఐయస్ఐ ప్రమాణాలు కలిగిన కేబుళ్లు, పీవీసీ పైపులతో నాణ్యమైన ఇన్స్టాలేషన్ చేస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే పట్టణంలో పలు ఇళ్లలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, వాటి ఫలితాలు చూసి మరికొందరు ముందుకు వస్తున్నారని నిర్వాహకులు చెప్పారు. సోలార్ పై అవగాహన పెరగడంతో గ్రామాల నుంచి కూడా విచారణలు వస్తున్నాయన్నారు. సోలార్ పై మరిన్ని వివరాలకు 9182119665, 9652459251 నంబర్లను సంప్రదించవచ్చని, తాడిపత్రిలో మార్కండేయ స్వామి ఆలయం ఎదురుగా, బృందావనం హోటల్ పక్కన గల కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

అంతర్జాతీయ వైద్య పత్రికలో ప్రొద్దుటూరు వైద్యురాలి పరిశోధనకు చోటు



ప్రొద్దుటూరు, నవంబర్ 14, (సీమవార్త): మధుమేహ బాధితుల్లో మూత్రపిండాల పనితీరు దెబ్బతినే ప్రమాదాన్ని ముందస్తుగా గుర్తించే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన యువ వైద్యురాలు డాక్టర్ ధైనిక తూతిక చేసిన పరిశోధన అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆమె రూపొందించిన పరిశోధనా వ్యాసం ప్రపంచ ప్రసిద్ధ వైద్య పత్రిక ఈస్టర్న్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ లో ప్రచురితమైంది. ఆమె ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ కుమార్తె. ప్రస్తుతం పుదుచ్చేరిలో జనరల్ మెడిసిన్ విభాగంలో సీనియర్ రెసిడెంట్గా పనిచేస్తున్న డాక్టర్ ధైనిక, మధుమేహం కారణంగా కిడ్నీలు దెబ్బతినే పరిస్థితిని ప్రారంభ దశలోనే గుర్తించే మార్గాలపై పరిశోధన చేశారు. ఇందులో భాగంగా మధుమేహం ఉన్న 50 మందిని పరిశీలించి, వారిలో కిడ్నీ సమస్యలు ఉన్నవారి రక్త నమూనాలను ఇతరులతో పోల్చి విశ్లేషించారు. కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో శరీర రక్షణకు తోడ్పడే కొన్ని పదార్థాల స్థాయిలు తగ్గడంతోపాటు, వాపునకు కారణమయ్యే కారకాలు పెరిగినట్లు గుర్తించారు. మూత్రంలో ప్రోటీన్ అధికంగా వెలువడే వారిలో ఈ మార్పులు మరింత స్పష్టంగా కనిపించినట్లు పరిశోధనలో వెల్లడైంది. రక్తంలోని నిర్దిష్ట జీవసూచికలను పరిశీలించడం ద్వారా కిడ్నీ నష్టాన్ని ముందుగానే గుర్తించే అవకాశాలపై ఈ పరిశోధన కీలక సమాచారాన్ని అందించింది. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స అందించేందుకు ఈ అధ్యయనం దోహదపడుతుందని వైద్య రంగ నిపుణులు పేర్కొంటున్నారు. 'డైస్రెగ్యులేటెడ్ పీబీఎంసీ ఎంఐఆర్-124-3పీ, టీఎన్ఎఫ్-ఆల్ఫా అండ్ రెసిస్టిన్ ఇన్ డయాబెటిక్ నెఫ్రోపతి' పేరుతో రూపొందించిన ఈ పరిశోధనా వ్యాసం 2026లో ఈస్టర్న్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ 31వ సంపుటి, నాలుగో సంచికలో ప్రచురితమైంది.

లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని దర్శించుకున్న చైర్మన్ పరిగి వేణుగోపాలరావు



లేపాక్షి నవంబర్ 14 సీమ వార్త: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చారిత్రక లేపాక్షి శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయనకు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఘనంగా స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ఆలయ ఆచార సంప్రదాయాల ప్రకారం పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, దేవాలయ చారిత్రక వైభవాన్ని మరింతగా ప్రాచుర్యంలోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన లేపాక్షి ఆలయ ఆధ్యాత్మిక, చారిత్రక విశిష్టతను కాపాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

కలెక్టర్ పేరుతో వచ్చిన వార్తలో వాస్తవం లేదు:

మున్సిపల్ కమిషనర్



ప్రొద్దుటూరు, నవంబర్ 14 (సీమవార్త): ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికలపై నివేదిక కోరిన కలెక్టర్' అనే శీర్షికతో ఓ యాప్ లో ప్రచురితమైన వార్తలో వాస్తవాలు లేవని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్పష్టం చేశారు. ప్రజలు ఇలాంటి నిరాధార కథనాలను నమ్మి గందరగోళానికి గురికావద్దని కోరారు. గతంలోనూ ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచురితమైనప్పుడు అభ్యంతరం తెలిపి, ఇకపై పునరావృతం చేయవద్దని సూచించినట్లు కమిషనర్ తెలిపారు. అయినప్పటికీ జిల్లా కలెక్టర్ పేరుతో వాస్తవాలు లేని కథనాలు ప్రచురించడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై ఆ యాప్ యాజమాన్యానికి ఇప్పటికే ఫిర్యాదు చేశామని, తాజా కథనంపైనా మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

వైకాపా నూతన ఎంపీటీసీలకు జిల్లా ఉపాధ్యక్షుడు ఘనంగా సన్మానం



మదకశిర నవంబర్ 14 సీమ వార్త నియోజకవర్గం లో ఇటీవల నూతనంగా గెలిచిన వైకాపా ఎంపీటీసీలను వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ ఘనంగా సన్మానించారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని మాజీ మంత్రి హెచ్చి నరసయ్య గౌడ్ స్వగృహంలో ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. 11 స్థానాల్లో పోటీ చేయగా ఐదు స్థానాలను వైకాపా గెలిచిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నూతన ఎంపీటీసీలు లోకనాథ్, జయన్న, గాయత్రి నగేష్ గౌడ, భూతన్న, లోకేష్, తదితరులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు రామన్న, కర్రీ అన్న, శ్రీరామ్ రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణా తరగతులు



సోమందేపల్లి నవంబర్ 14 సీమ వార్త మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సర్పంచ్ ఎన్నికల ఎన్నికల పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలా ఉండాలి, ఏ జాగ్రత్తలు పాటించాలి, భద్రత అవసరం ఐతే ఎవరిని సంప్రదించాలి అని తదితర అంశాల పై శిక్షణ కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంఈఓ ఆంజనేయులు నాయక్, ఎన్నికల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరారెడ్డి



మదకశిర నవంబర్ 14 సీమ వార్త ఆంధ్రప్రదేశ్ ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన, సోనియా గాంధీ రచించిన "బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్" పుస్తక పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న సీడబ్ల్యుసి సభ్యులు మాజీమంత్రి రఘువీరారెడ్డి.ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ సిసభ్యులు డాక్టర్ ఎన్. రఘువీర రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య , సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస రావు , అలాగే గొల్ల నారాయణ రావు, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మనోహర్ నాయుడు గారు అధ్యక్షత వహించారు. సోనియా గాంధీ స్ఫూర్తిదాయక ప్రయాణం, విలువలు మరియు అనుభవాల గురించి చర్చించుకోవడానికి ఇది ఒక అద్భుతమైన సందర్భం. అని తెలిపారు.

ప్రారంభమైన 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు.



ధర్మవరం నవంబర్ 14సీమ వార్త ; ధర్మవరం పట్టణంలోని బాబు జగ్జీవన్ రాగం నగర్ లో గల ప్రధాన పౌరశాఖ గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ గోపాల్ నాయక్, మురళి, కె. నాగరాజు, కేహెచ్. నాగరాజు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ పెద్దన్న పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ, నవంబర్ 14న బాలల దినోత్సవ సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ప్రాథమిక దశనుండే విద్యార్థులు క్రమ శిక్షణతో కూడినటువంటి విద్యను అభ్యసించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది రాము, ముకుంద, రమణా నాయక్, శివమ్మ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

36 వ అఖిల భారత కిసాన్ సభ లను జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్ నవంబర్ 14 సీమ వార్త : అఖిలభారత కిషన్ సభ ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు తెలిపార. ఈ సందర్భంగా అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గరడంపల్లి గ్రామంలో ఆనందమ్మ మహిళ రైతు తో జెండా ఆవిష్కరించడం జరిగినది అని తెలిపారు.. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న ఉపాధ్యక్షులు ఏ మారుతి మాట్లాడుతూ అఖిల భారత కిసాన్ సభ 36వ మహాసభలు నల్గొండ జిల్లాలో15.11.2026 నుంచి 18.11.2026 వరకు వేలాది మంది రైతులతో మహాసభలు జరుగుతున్నాయని మహాసభలకు ప్రతి ఒక్క రైతులు మహిళా రైతులు కదలి రావాలని పిలుపునివ్వడం జరిగినది ముఖ్యంగా శ్రీ సత్య సాయి జిల్లాలో రైతాంగాన్ని ఆదుకోవడం కోసం కరువు సహాయం చర్యలను వెంటనే చేపట్టాలని 25వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని చెరువులను పూర్తిస్థాయిలో నీటితో నింపాలని ప్రతి చెరువుకు పిల్ల కాలువలను ఏర్పాటు





చేయాలని నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారం వెంటనే అందించాలని రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని పంటల సాగు కోసం సాగు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని ఉపాధి హామీ గ్రామీణ పథకమును 200 రోజులకు పెంచాలని కూలి రేట్లను 600 రూపాయలకు పెంచాలని గ్రామీణ ప్రాంతాలలో గడ్డి కేంద్రాలను ఏర్పాటు చేయాలని తాగునీరు సాగునీరు అందించాలని మొదలగు ప్రధానమైన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడానికి మహాసభలను జయప్రదం కోసం ప్రతి ఒక్కరూ కదలి రావాలని వారు పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్వైఎ్ భాష ,జె.వి రమణ, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ , చంద్రాయుడు, నారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీకి కొత్త విధానం..

ఇకపై ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే విక్రయాలు

రైతులకు మరింత పారదర్శకంగా ఎరువుల పంపిణీ



బొమ్మనహాళ్, నవంబర్ 14 (సీమ వార్త): బొమ్మనహాల్ మండల కేంద్రంలో శ్రీ శక్తి భవనంలో ఈరోజు వ్యవసాయ రంగంలో డిజిటల్ సేవలను విస్తరించడంతో పాటు రైతులకు ఎరువుల కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం నుంచి రాష్ట్రంలో ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు నిర్వహించనున్నారు.ఈ నూతన విధానంపై రైతులకు, ఎరువుల విక్రయదారులకు అవగాహన కల్పించేందుకు బొమ్మనహాళ్ మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి, ప్రైవేటు ఎరువుల డీలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన ఎరువుల రకాలను ఎంపిక చేసుకుని, క్యూఆర్ కోడ్ విధానం ద్వారా తమకు అనుకూలమైన డీలర్ వద్ద ఎరువులను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. డిజిటల్ విధానంలో విక్రయాలు జరగడం వల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణాన్ని బట్టి అవసరమైన ఎరువుల మోతాదును నిర్ణయించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని, తద్వారా ఎరువుల వృథాను తగ్గించి పంటలకు సరైన పోషకాలు అందించవచ్చని వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. సాయికుమార్, రైతు సేవా కేంద్రాల ప్రతినిధులు, ప్రైవేటు ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

హిందూ సమాజ ఐక్యత, చైతన్యమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యం



ప్రొద్దుటూరు, నవంబర్ 14, (సీమవార్త): హిందూ సమాజాన్ని సంఘటితం చేసి, ఐక్యతా భావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక చైతన్యం తీసుకురావడమే విశ్వహిందూ పరిషత్ హితచింతన్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆ సంస్థ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల్ల సత్యం పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర హితచింతన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన ప్రొద్దుటూరులోని మత్స్య కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా హిందువులందరినీ ఐక్యంగా ఎలా సంఘటితం చేయాలి, సమాజంలో పరస్పర సహకారం, ఐక్యతా భావాన్ని ఎలా పెంపొందించాలి, హిందువుల్లో సామాజిక చైతన్యం ఎలా తీసుకురావాలనే అంశాలను వివరించారు. హిందూ సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. హితచింతన్ కార్యక్రమం ద్వారా విశ్వహిందూ పరిషత్ లక్ష్యాలు, సంస్థ చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు, హిందూ సమాజ సంఘటన ఆవశ్యకతను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంత కార్యదర్శి ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి, కాల్వ చలపతి, సురేంద్రనాథ్ రెడ్డి, మార్కండేయ, మురళి, సురేంద్రతో పాటు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన ప్రపంచ చక్కెర వ్యాధి వారోత్సవాలు.

రిటైర్డ్ అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంకారపు నర్సింహులు.



ధర్మవరం నవంబర్ 14సీమ వార్త ; ధర్మవరం పట్టణంలోని ఎస్బిఐ కాలనీ మధు కంటి వైద్యశాలలో ప్రపంచ చక్కెర వ్యాధి వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని రిటైర్డ్ అందరి నివారణ అధికారి డాక్టర్ సంకారపు నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని డాక్టర్లతో, స్వచ్ఛంద సేవా సంస్థలతో ఈ చక్కెర వ్యాధి వారోత్సవాలు యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో ఎక్కువ మంది చెక్కర వ్యాధితో బాధపడుతున్నారని, చికిత్స ఒకటే మార్గము అని తెలిపారు. ఇటువంటి రోగాలు జీవన శైలికి సంబంధించిన వ్యాధులుగా గుర్తించడం జరుగుతోందని తెలిపారు. చక్కెర వ్యాధి ఒక ప్రత్యేకమైన అవయవానికి సంబంధించిన జబ్బు కాదు అని, ఈ వ్యాధి వల్ల ముఖ్యంగా శరీరంలోని రక్తనాళాములు దెబ్బ తిట్టున్నాయని, అందువలన గుండె, మెదడు, మూత్రపిండాలు, కళ్ళ జబ్బులు బారిన ప్రజలు పడుతున్నారని తెలిపారు. కావున చక్కెర వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా కంటి డాక్టర్ తో కంటి రెటీనా పరీక్షలు చేయించుకోవాలని వారు స్పష్టం చేశారు. దీని ద్వారా కంటి చూపును కాపాడుకునే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ప్రొజెక్ట్ లేజర్ షో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పందన హాస్పిటల్ డాక్టర్ బషీర్, డాక్టర్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ వాసుదేవ రెడ్డి, డాక్టర్ భరత్, యువర్ ఫౌండేషన్ ప్రతినిధులు కేతా లోకేష్, కృష్ణమూర్తి, షీలా నాగేంద్ర ,లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గవ్వల రాధాకృష్ణ ,పోలా ప్రభాకర్ తదితరులు పాల్గొని ప్రపంచ చక్కర వ్యాధి వారోత్సవ కరపత్రాలు విడుదల చేశారు.

శనివారం సందర్భంగా నేమకల్లు బాలాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



బొమ్మనహాల్, నవంబర్ 14 (సీమ వార్త): బొమ్మనహాల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నేమకల్లు శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూలమాలలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్ స్వామి, సంతోష్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా బొమ్మనహాల్ మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ బాలాంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ కమిటీ చైర్మన్లు, సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు.



పెనుకొండ నవంబర్ 14 సీమవార్త. పట్టణంలోని గ్రంథాలయం లో శనివారం 59వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలు ఇన్చార్జ్ గ్రంథాలయ అధికారి అఫ్సాన్ అహమ్మద్ ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 137వ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.సమావేశంలో ముఖ్య అతిథి గా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు అమర్ సింగ్ మాట్లాడుతూ నెహ్రూ భారత దేశానికి తొలి ప్రధానిగా చేసిన సేవలను గురించి విద్యార్థులకు తెలియజేశారు.అనంతరం పిల్లలతో గ్రంథాలయం వారోత్సవాలు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో ఇన్చార్జ్ గ్రంథాలయ అధికారి అఫ్సాన్ అహమ్మద్, విద్యార్థులు, గ్రంథాలయం పాఠకులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ గ్రంథాలయంలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



బొమ్మనహాల్, నవంబర్ 14 (సీమ వార్త): బొమ్మనహాల్ శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి ఏ. బాబాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్ పాల్గొని వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ నెహ్రూ సేవలను విద్యార్థులకు వివరించి, బాలల దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, నృత్యం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించనున్నారు. 19న ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమంతో వారోత్సవాలను ముగించనున్నారు.ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఏ. బాబాప్రసాద్ కోరారు.ఈ కార్యక్రమంలో రమేష్, పృథ్వీ, కె.పి. వన్నూరుస్వామి, బోయ ముక్కన్న, నాగేశ్వర్ రెడ్డి, విద్యార్థులు, పాఠకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



డి.హీరేహాల్, నవంబర్ 14 (సీమవార్త): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు--2026లో భాగంగా శనివారం డి.హీరేహాల్ శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో దాసనాయక్, గడినాడు కన్నడ సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు షెట్టు సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో దాసనాయక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ తొలి ప్రధానిగా నెహ్రూ అందించిన సేవలు, దేశ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం సందడిగా సాగింది.

నాగలమడకకు భక్తులు పాదయాత్ర.



పెనుకొండ నవంబర్ 14 సీమవార్త. పట్టణంలోని కోటమీద ఆంజనేయస్వామి భక్త బృందం శనివారం కర్ణాటక రాష్ట్రంలోని పావగడ సమీపంలో ఉన్న నాగలమడకకు భక్తిశ్రద్ధలతో బయలుదేరారు.ఈ సంర్భంగా ఎన్ఎస్ఎస్ఎసీటీ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారు పాదయాత్ర లో స్వామి కీర్తనలు పాడుతూ బయలు దేరి వెళ్లారు.

సర్పంచ్ ఎన్నికలపై టీడీపీ నాయకులతో సమావేశం.



పెనుకొండ నవంబర్ 14 సీమవార్త. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం మంత్రి సవితమ్మ ఆదేశాలతో జడ్పీటీసీ యశోదకేశవయ్య, కన్వీనర్ ఈశ్వరప్రసాద్ ఆధ్వ ర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాంపురం, శెట్టిపల్లి, నాగులూరు, అడదాకులపల్లి, మావుటూరు గ్రామ పంచాయతీలకు చెందిన టీడీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.సమావేశంలో ఆయా గ్రామ పంచాయతీల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపిక తదితర వాటిపై చర్చించారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో పెనుకొండ మండల కన్వీనర్ దండు ఈశ్వరప్రసాద్,జడ్పీటీసీ యశోద కేశవయ్య,సింగిల్ విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, నాయకులు నాగలూరు నారాయణ స్వామి,లక్ష్మీనారాయణరెడ్డి, గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీటీసీ బోయ రామకృష్ణ, మావటూరు గోపాల్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వస్తు ప్రదర్శనకు విశేష ఆదరణ.





పావగడ : నవంబర్ 14 సీమ వార్త పావగడ: బాలల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జ్ఞానబోధిని పాఠశాలలో శనివారం నిర్వహించిన కళా, విజ్ఞాన మరియు చేతి వృత్తుల వస్తు ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వందలాది నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో విజ్ఞాన నమూనాలు, కళాకృతులు, చేతి వృత్తుల వస్తువులు, మట్టి బొమ్మలు, కాగితం పువ్వులు, వ్యర్థాలతో తయారు చేసిన ఉపయోగకరమైన వస్తువులు, కన్నడ నాడు చిత్రాలు, పర్యావరణ పరిరక్షణ నమూనాలు ఉంచారు. కన్నడ నాడు చరిత్ర, మహనీయులు, పర్యావరణ పరిరక్షణ, చంద్రయాన్, సౌరమండలం, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించి వివరించారు. మట్టి కళాకృతులు, వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులు, చేతి చిత్రాలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ప్రతి వస్తువు గురించి విద్యార్థులే వివరణ ఇచ్చారు. వస్తువులను వీక్షించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కార్యక్రమంలో మాట్లాడిన జ్ఞానబోధిని పాఠశాల కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. అనిల్ కుమార్, బాలల దినోత్సవం, కన్నడ రాజ్యోత్సవం మరియు కళా, విజ్ఞాన, చేతి వృత్తుల వస్తు ప్రదర్శనను పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. సుమారు 480 మంది విద్యార్థులు వస్తు ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. వస్తు ప్రదర్శన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఒక వేదిక అని అన్నారు.జ్ఞానబోధిని సంస్థ అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు నమూనాలను తయారు చేయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం తీసుకుని మంచి నమూనాలు తయారు చేశారన్నారు. విద్యార్థులు నమూనాలు తయారు చేయడం వల్ల శాస్త్రీయ రంగంపై మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా పాల్గొన్న రాజబాబు, మారుతేశ్, సిద్దేశ్వరి, పరమేశ్ నాయక్ మాట్లాడుతూ, ఇలాంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం మరియు కన్నడ భాషపై అభిమానం పెరుగుతుందన్నారు. పాఠ్యాంశంతో పాటు ప్రాయోగిక జ్ఞానం కూడా ముఖ్యమన్నారు. విద్యార్థుల సృజనాత్మకతకు అందరూ ప్రశంసలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మైలారెడ్డి, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ హాకీ పోటీలకు ధర్మవరం విద్యార్థి ఎంపిక.

మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాల విద్యార్థి గ్రందే వెంకట అభిషిక్త్ .



ధర్మవరం నవంబర్ 14 సీమ వార్త : గత నెల 30వ తేదీన గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి అండర్ 19 హాకీ జట్టుకు గుంటూరు మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలకు చెందిన ధర్మవరం విద్యార్థి గ్రంధే వెంకట అభిషిక్త్ ఎంపిక కావడం జరిగిందని మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థి గ్రంధే వెంకట అభిషిక్త్ గుంటూరు జిల్లా తరఫున పాల్గొనే హాకీ జట్టులో ఈనెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు పులివెందుల లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థిని మాస్టర్ మైండ్స్ కళాశాల యాజమాన్య బృందం, అధ్యాపకులు, తల్లిదండ్రులు తోటి విద్యార్థులు అభినందించారు.

ప్రజాస్వామ్యం విలువలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు.



పెనుకొండ నవంబర్ 14సీమవార్త. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం లో శనివారం ఎస్వీఈఈపీ కార్యక్రమం లో భాగంగా 158 పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు.పోటీలు ఆర్డీఓ, నియోజక వర్గ ఓటరు నమోదు అధికారి ఆనందకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పలు మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు ఓటుహక్కు, ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు విధానం, ప్రజాస్వామ్య విలువలు పట్ల అవగాహన తదితర వాటిపై పోటి పరీక్ష లు నిర్వహించారు. పోటీ లలో విజేతలు గా నిలిచిన విద్యార్థులను ఈ నెల 17నుంచి 18 వతేదిలోపు నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు.

అయ్యప్ప సన్నిధిలో బీజేపీ యువ నాయకుడు పార్థసారథి రెడ్డి


-- అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

-- పార్థసారథి ని సన్మానం చేసిన గురుస్వాములు



సోమందేపల్లి, నవంబర్ 14 సీమ వార్త గ్రామం సుభిక్షం గా ఉండాలి అని, ప్రజలు అందరు బాగుండాలని శనివారం బీజేపీ యువ నాయకులు పార్థసారథి రెడ్డి అయ్యప్ప స్వామి కి పూజలు చేశారు. మండల కేంద్రంలోని అక్కమ్మకొండ వద్ద ఉన్న హరిహర అయ్యప్ప స్వామి ఆలయంలో లో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురు స్వామి అజంతా అయ్యప్ప కి పూజలు చేసి స్వామి వారి ప్రసాదం పార్థసారథిరెడ్డి కి అందించారు. అనంతరం గురుస్వాములు పార్థసారథిరెడ్డి కి శాలువా కప్పి పూలమాల వేసి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు తిమ్మారెడ్డి, సురేష్, గిరి, శ్రీనివాసులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల బందోబస్తుకు డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా



కడప, నవంబర్ 14, (సీమవార్త): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు, గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ప్రచారం నిర్వహించడం నిషేధమన్నారు. పరిసరాల్లో 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉన్నాయని, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

కర్ణాటక పవర్ ప్లాంట్‌లో ప్రమాదం.. నేమకల్లు యువ కార్మికుడు దుర్మరణం



బొమ్మనహల్, నవంబర్ 14 (సీమ వార్త): కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తోరణగల్లు సమీపంలోని కుడితిని గ్రామం వద్ద ఉన్న కేపీసీఎల్ పవర్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో నేమకల్లు గ్రామానికి చెందిన యువ కార్మికుడు కురుబ బసవరాజ్ (24) దుర్మరణం చెందాడు. పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కన్వేయర్ బెల్ట్‌లో పడటంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనతో నేమకల్లు గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడు బసవరాజ్‌కు భార్య జయమ్మతో పాటు ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నాడు. కుటుంబానికి ఆధారమైన యువకుడు అకాల మరణం చెందడంతో భార్య, చిన్నారి దిక్కులేని పరిస్థితిలో మిగిలారని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నామినేషన్ల సందర్భంగా విజిబుల్ పోలీసింగ్



టి సుండుపల్లి నవంబర్ 14సీమ వార్త సుండుపల్లి మండలంలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ సురేష్ రెడ్డి,ఎస్ఐ అమర్నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు సుండుపల్లిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది కవాతు నిర్వహిస్తూ ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టామని శాంతి భద్రతలకు విఘాతం కలిగించి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పంచాయితీ నామినేషన్ల కార్యక్రమానికి ఏర్పాట్ల పరిశీలన



మడకశిర నవంబర్ 14 సీమ వార్త నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలంలో పంచాయితీ కేంద్రాలలో నామినేషన్లు వేసి ఏర్పాట్లను ఎంపీడీవో కేశవరెడ్డి, ఎస్సై రమేష్ బాబు పరిశీలించారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేవారు పంచాయితీ కేంద్రాలలోని నామినేషన్లు వేయడానికి అవకాశం ఉండగా ఈసారి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో కేశవరెడ్డి తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ తిరుమల గౌడ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పీర్లమణ్యంలో తీరిన డ్రైనేజీ కష్టాలు

ఏండ్ల సమస్యకు ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి చెక్!



తాడిపత్రి నవంబర్ 14 సీమవార్త : నియోజకవర్గ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు 46వ వార్డ్ లో ఎన్నో ఏండ్ల నుండి నెరవేరని సమస్య తీరనుంది. 46వ వార్డ్ పీర్లమణ్యం తగ్గులో ఉన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ, సచివాలయ సిబ్బందితో పాటు 46వ వార్డ్ కౌన్సిలర్ మంజుల శ్రీదేవి, మున్సిపాలిటీ ఏఈ అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారులను ఆదేశించి కొత్త డ్రైనేజీ లైన్ వేసేటట్లు చర్యలు తీసుకున్నారు. దీంతో అధికారులు వెంటనే పనులు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షం వస్తే చాలు రోడ్లపై మురుగు నీరు నిలిచిపోయి, ఇళ్లలోకి వచ్చే పరిస్థితి ఉండేదని కాలనీ వాసులు తెలిపారు. దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఏండ్ల తరబడి డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. “ఎమ్మెల్యే కి చెప్పగానే వెంటనే పనులు మొదలయ్యాయి. ఇక మా కష్టాలు తీరినట్టే” అని కాలనీ వాసులు అన్నారు. సమస్యను పరిష్కరించినందుకు జేసీ కుటుంబానికి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మంజుల శ్రీదేవి మాట్లాడుతూ “వార్డ్ లో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించడమే మా లక్ష్యం. ఎమ్మెల్యే సహకారంతో పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందిస్తాం” అని కౌన్సిలర్ మంజుల శ్రీదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో దబ్బర బాబు, మంజుల శివ, మురుగన్ బాలు, చంద్ర, చిన్న, కత్తి రామాంజులు రెడ్డి, దినేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రశాంత వాతావరణానికి గుర్రపు కొండ గ్రామంలో పోలీసుల గ్రామ పర్యటన

సమస్యాత్మక గ్రామాల్లో మడకశిర అడ్డ్రేడ్ ఇన్స్పెక్టర్ -- రౌడీషీటర్లకు పోలీసుల గట్టి హెచ్చరిక,



మడకశిర నవంబర్ 14 సీమ వార్త పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ అప్రమత్తమైంది.ఈ క్రమంలో మడకశిర అడ్డ్రేడ్ ఇన్స్పెక్టర్ తమ పోలీసు సిబ్బందితో కలిసి గుర్రపు కొండ గ్రామంలో గ్రామ పర్యటన చేసి ట్రబుల్ మాంగర్స్ కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, దాడులు, అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా ఉపేక్షించబోమని సీఐ శివరాముడు స్పష్టం చేశారు.అనంతరం గ్రామ ప్రజలతో సమావేశాలు నిర్వహించి పోలీసు చట్టం (30 పోలీస్ యాక్ట్),ఎన్నికల ప్రవర్తనా నియమావళి,శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఎన్నికల సమయంలో ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,ఎలాంటి ప్రలోభాలకు,బెదిరింపులకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.ఎన్నికలు ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని,ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని అధికారులు కోరారు

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించిన రోటరీ క్లబ్



ప్రొద్దుటూరు, నవంబర్ 14, (సీమవార్త): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అమ్మా నాన్న వృద్ధాశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు ఉచితంగా రక్తపోటు (బీపీ), మధుమేహ (షుగర్) పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా వారికి అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయత చూపడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ శర్మ, రొటేరియన్లు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, జి.వి. రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

హేమావతి పంచాయతీ సర్పంచ్ స్థానానికి అవకాశం కల్పించండి

న్యాయవాది వడ్డే గోవిందప్ప

అమరాపురం నవంబర్ 14 సీమవార్త మండల పరిధిలోని హేమావతి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేయడానికి ఆశావహుల జాబితాలో సీనియర్ టిడిపి నాయకుడు న్యాయవాది కెంకెర వడ్డే గోవిందప్ప కూడా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ తాలూకా రైతు అధికార ప్రతినిధిగా ఉన్నట్లు గతంలో పంచాయతీ టిడిపి ప్రధాన కార్యదర్శిగా మరియు డీలర్ గా, ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేశానని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతుతో హేమావతి గ్రామపంచాయతీ నుండి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆశవాహులుగా రేసులో నిలిచినట్లు గోవిందప్ప పేర్కొన్నారు. హేమావతి సర్పంచ్ స్థానం ప్రస్తుతం బీసీ జనరల్ కేటగిరి కేటాయించడం ద్వారా



తనకు అవకాశం కల్పించాలని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

లను కూడా కోరుచున్నట్లు పేర్కొన్నారు. వడ్డే గోవిందప్ప కుటుంబం దివంగత ఎన్టీ రామారావు పార్టీ స్థాపించినప్పుడు నుండి టిడిపి పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హేమావతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సర్పంచ్ బరిలో నిలపాలని స్థానిక నాయకులు కార్యకర్తల సహకారం ద్వారా కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఆశీస్సులు నియోజకవర్గ ముఖ్య నేతల మద్దతుతో తమకు అవకాశందక్కుతుందనే ఆశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. అవకాశం కల్పిస్తే స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు సహకారంతోపాటు పంచాయతీ ప్రజల అండతో భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

వలస పంచాయతీ సర్పంచ్ ఆశావహుల్లోటిడిపి నాయకుడు నిరంజన్

అమరాపురం నవంబర్ 14 సీమవార్త మండల పరిధిలోని వలస పంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేయడానికి మీసేవ నిరంజన్ తనకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరుచున్నట్లు తెలిపారు. డిగ్రీ పట్టభద్రుడైన నిరంజన్, ప్రజాసేవా కార్యక్రమాలు, సామాజిక సేవల ద్వారా మండల ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు నిరంజన్ తండ్రి అదే పార్టీలో కొనసాగుతూ సామాన్య కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మంచి పేరు సంపాదించుకున్నారు. తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తూ నిరంజన్ కూడా తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ముఖ్యంగా రెండు పర్యాయాలు వలస పంచాయతీ టిడిపి పంచాయతీ కన్వీనర్ గా, ప్రస్తుతం యూనిట్ ఇన్చార్జిగా పార్టీకి సేవలు అందిస్తున్నారు. ఎన్నో ఏండ్ల నుండి పార్టీలో కొనసాగుతున్నామని అవకాశం ప్రస్తుతం జనరల్ కేటగిరికి రిజర్వేషన్ సర్పంచ్ స్థానానికి కేటాయించడం ద్వారా తమకు అవకాశం ఇవ్వాలని మండల టిడిపి నాయకులకు ఆయన కోరుచున్నారు. మీసేవ కేంద్రం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలు, సమస్యలు తెలుసుకుంటూ సేవలందించడం ద్వారా వలస పంచాయతీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అదేవిధంగా వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యుడిగా కొనసాగుతూ విద్యాభివృద్ధికి తనవంతు సహాయ





సహకారాలు అందిస్తున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరఫున విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, ఇతర విద్యా సామగ్రి అందించడంలో భాగస్వామ్యం అవుతూ పాఠశాల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. అలాగే ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ ప్రజలతో నిరంతరం మమేకమై వారి ఆలోచనలు, అవసరాలు, సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. మీసేవ సేవలతో పాటు సామాజిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనడం ద్వారా మండల స్థాయిలో కూడా మంచి గుర్తింపు పొందారని పలువురు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా మీసేవ నిరంజన్ మాట్లాడుతూ, "వలస పంచాయతీ ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఈ ఒక్కసారి సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే, అందరి సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేసి చూపిస్తాను. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తాను" అని తెలిపారు. విద్యావంతుడిగా, యువకుడిగా, చురుకైన వ్యక్తిగా ప్రజలకు సేవలందిస్తున్న తనకు ఈసారి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని ఆయన వలస పంచాయతీ ప్రజల ఆశీర్వాదంతో అవకాశం వస్తే పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే నా లక్ష్యం పేర్కొన్నారు.

కరాటేలో స్టేట్ లెవెల్ కి..... గోరంట్ల స్టూడెంట్ సెలెక్ట్.

....రాష్ట్ర స్థాయి 70వ ఎస్ జి ఎఫ్ ఐ పోటీలకు.... గోరంట్ల కరాటే విద్యార్థి హరికృష్ణ ఎంపిక.

గోరంట్ల నవంబర్ 14 సీమ వార్త స్థానిక గోన్‌షిరో కరాటే అకాడమీలో మాస్టర్ రాజేష్ కుమార్ వద్ద శిక్షణ పొందుతున్న వివేకానంద స్కూల్ విద్యార్థి జి. హరికృష్ణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.హిందూపూర్‌లోని జడ్.పి.హెచ్.ఎస్ బసవనహళ్లిలో ఫైరోజ్ మాస్టర్ ఆధ్వర్యంలో బా+ఖీ× అధికారులు మోరార్జీ మరియు సురేష్ లు పర్యవేక్షణలో నిర్వహించిన 70వ ఏ.పి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2026-27 పోటీలలో భాగంగా అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా తరపున స్టేట్ లెవెల్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యారని త్వరలో మన్యం జిల్లా పార్వతీపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లా తరపున హరికృష్ణ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా హరికృష్ణ ను, అతని తల్లిదండ్రులు శ్రీమతి భార్గవి శ్రీ గణేష్ దంపతులను ఎస్.పి.వి.ఎం. కళాశాల యాజమాన్యం తరపున ప్రిన్సిపాల్ శ్రీ భక్తవత్సలం, వివేకానంద స్కూల్





యాజమాన్యం మరియు సీనియర్ మాస్టర్ ఆరీఫా, ఇంస్ట్రక్టర్స్ దీక్ష, విష్ణు, వెన్య హర్షం వ్యక్తం చేస్తూ ప్రతి సంవత్సరం గోరంట్లకు ప్రాతినిధ్యం దొరకటం గోరంట్ల ప్రజల ఆదరణ కు కృతజ్ఞతలు తెలుపుతూ విజేత ని అభినందించారని నిర్వాహకులు త్రివిక్రమ్ తెలిపారు

మీ సేవలు ప్రజలకెంతో అవసరం

.....కొక్కంటివారిపల్లి యూత్ ఆధ్వర్యంలో జడ్పీటీసీ సభ్యుడు సిరివేళ్ల ప్రసాద్ కు ఘన సన్మానం

ఓడి చెరువు, నవంబర్ 14:- సీమ వార్త. మండల ఎన్డిఏ జడ్పీటీసీ అభ్యర్థిగా గెలుపొందిన సిరివేళ్ల ప్రసాద్ ను, మండల పరిధిలోని కొక్కంటివారిపల్లి యూత్ ఆధ్వర్యంలో,ఆయన స్వగ్రామం చింతమానిపల్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ,పూలమాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మండల జడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికైనందుకు చాలా సంతోషంగా ఉందని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.మీ సేవలు ప్రజలకు ఏంతో అవసరమని వారు పేర్కొన్నారు. మదనపల్లి పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల చదువుకు మీరు చేసిన సాయం,ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు పలువురికి ఆదర్శమని తెలిపారు.ఈ కార్యక్రమంలో దివాకర్,శ్రీనివాస్ అరుణ్,సిసింద్రీ,సురేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



క్రిమిసంహారక మందు పోసిన దోమతెరలు పంపిణీ





మడకశిర నవంబర్ 14 సీమ వార్త మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీఉల్లా ఆధ్వర్యంలో మండలం లోని అన్ని హాస్టల్స్ లోను విద్యార్థులకు నేషనల్ వేక్టర్ బోర్న్ డిసిజెస్ కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా క్రిమిసంహారక మందు పూసిన దోమతెరలను శనివారం పంపిణి చేయడం జరిగింది. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చీకున్ గన్య లాంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవడానికి ఈ దోమతెరలు పంచడం జరిగింది. సాధారణ దోమతెరలకు భిన్నంగా, ఈ తెరల దారాలలోనే ప్రత్యేకమైన క్రిమిసంహారక రసాయనం (పైరెథ్రాయిడ్) కలిపి తయారు చేస్తారు. దీనివల్ల దోమలు తెరపై వాలినప్పుడు అవి చనిపోతాయి లేదా దూరంగా పారిపోతాయి. వీటిని కనీసం 20 సార్లు ఉతికినప్పటికీ లేదా సుమారు 3 సంవత్సరాల వరకు వీటిలోని ఔషధ ప్రభావం తగ్గకుండా పనిచేస్తుందని తెలియజేయడం జరిగింది.ఈ దోమతెరలను తక్షణమే ఉపయోగించకుండా రెండురోజులు నీడలో ఆరబెట్టిన తర్వాత ఉపయోగించవలయుననిలి తెలియజేయడం జరిగింది. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ షమీఉల్లా ఆరోగ్యకార్యకర్త రమేష్ కుమార్ ఎం జె పి ఏ పి బాయ్స్ హాస్టల్ ప్రిన్సిపాల్ అస్మా బాను , ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల సర్పంచ్ గా.....అవకాశం ఇస్తే పార్టీకి ప్రజలకు సేవ చేస్తా.

... పార్టీ కార్యాలయంలో..... బయోడేటా అందజేసిన టిడిపి నేత రమేష్.



గోరంట్ల నవంబర్ 14 సీమ వార్త స్థానిక గోరంట్ల మేజర్ పంచాయతీ ఎస్సీ రిజర్వేషన్ నేపథ్యంలో మాకు అవకాశం కల్పించాలని టిడిపి నేత మాజీ డీలర్ రమేష్ స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తన బయోడేటా అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, హస్తక లవర్ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, టిడిపి జిల్లా కార్యదర్శి, మండల ఎంపీపీ అభ్యర్థి నరేష్ తదితరులకు అందజేశారు. పార్టీ కోసం నిరంతరం కృషి చేశానని ఎన్నో ఏళ్ల తర్వాత మొదటిసారిగా గోరంట్ల పంచాయతీ ఎస్సీ రిజర్వేషన్ జరిగిందని అందులో భాగంగా పార్టీకి నేను చేసిన సేవలను గుర్తించి సర్పంచ్ గా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని రమేష్ నాయకులను కోరారు.ఈ కార్యక్రమంలో గౌని వారి పల్లి సింగిల్ విండో అధ్యక్షులు రవి మోహన్, గుమ్మయగారి పల్లి హరి, మాది మండల కన్వీనర్ రాజారెడ్డి, గిరిధర్ గౌడ్, అజంతుల్లా, పసుపులేటి శ్రీనివాసులు, చింతా రామచంద్రారెడ్డి, డీలర్ సురేంద్ర, జిలాన్, కసిరెడ్డిపల్లి శంకర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై.... పిఓ లకు అవగాహన కార్యక్రమంలో.

.... పిఓలకు అవగాహన కల్పించిన... ఎంపీడీవో కమల భాయ్.



గోరంట్ల నవంబర్ 14 సీమ వార్త. స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడవ విడుదల భాగంగా ఈ నెలకొన్న గోరంట్ల మండలంలో జరగబోవు పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఎలాంటి పొరపాట్లు లేకుండా సవ్యంగా జరగాలని పోలింగ్ అధికారులకు మండల ఎంపీడీవో కమల భాయ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో డిప్యూటీ డివైఓ జాన్ రెడ్డప్ప పాల్గొన్నారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా పిఓ లతో ఇటు మండల పరిషత్ కార్యాలయంలోనూ మరియు పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఆవరణలోని ఆడిటోరియంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు.ఉదయం 9 గంటల నుంచి స్టేజ్ వన్ మరియు స్టేజ్ 2 రిటర్నింగ్ ఆఫీసర్ లకు విబేక్స్ లో ఎంపీడీవో ట్రైనిక్ కండక్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోత్తు కు ప్రాధాన్యత ఇవ్వండి...3 సర్పంచ్ స్థానాలు బిజెపి కి ఇవ్వండి

... గోరంట్ల మేజర్ పంచాయతీలో 4 వార్డు మెంబర్లు ఇవ్వాల్సిందే.

.... డిమాండ్ చేసిన బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ.



గోరంట్ల నవంబర్ 14 సీమ వార్త స్థానిక పంచాయతీ ఎన్నికల్లో గోరంట్ల మేజర్ పంచాయతీ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి చెందిన ఎస్సీ నరసింహులు కు అవకాశం కల్పించాలని శనివారం గోరంట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బిజెపి నాయకులు పోటీ చేసే అభ్యర్థుల బయోడేటా అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ గోరంట్ల మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి కి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని బిజెపికి కేటాయించి సహకరించాలని వాటితో పాటు మేజర్ పంచాయతీలోని నాలుగు వార్డులు అవకాశం కల్పించాలని మూడు సర్పంచులు గంగంపల్లి గోరంట్ల పాలసముద్రం గ్రామపంచాయతీలు సర్పంచ్లకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మారుతి, ఈశ్వర్ రెడ్డి వెంకటాచలం, భజంత్రీశంకర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



చిలమత్తు రు నవంబర్ 14 సీమ వార్త జిల్లా గ్రంథాలయ సంస్థ, ఉమ్మడి అనంతపూర్ మరియు శ్రీ సత్య సాయి జిల్లా అదీనములో పనిచేయుచున్న శాఖా గ్రంథాలయం చిలమత్తూరు నందు ఈరోజు(14-11-2026) 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఎంపీడీవో హరికృష్ణ బాలాజీ సార్ గారు మరియు రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీ రాములు గారు, విచ్చేసి ముందుగా నెహ్రూ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు .అనంతరం శ్రీ ఎంపీడీవో బి హరికృష్ణ బాలాజీ సార్ గారు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లలో భాగంగా బాలలను దినోత్సవం జరుపుకోవడం మన అదృష్టం అని. మన దేశ మొట్టమొదటి ప్రధాని నెహ్రూ గారికి చిన్నపిల్లలు అంటే చాలా ఇష్టం అని, అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలమత్తూరు రిటైర్డ్ టీచర్ శ్రీరాములు మాట్లాడుతూ పిల్లల చేత గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. అలాగే గ్రంథాలయాధికారి ఆర్.మల్లికార్జున మాట్లాడుతూ ఈ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని తెలియజేసారు. కావున ప్రతి ఒక్క విద్యార్థి ఆసక్తిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు సొసైటీ మల్లికార్జున తంజుల్ శివ నరేంద్ర గంగాధర పూర ప్రజలు విద్యార్థిని విద్యార్థులు గా పాఠకులు , తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ సర్పంచ్ అభ్యర్థిగా మకాశి వెంకటేశులు



డి.హీరేహాల్, (సీమవార్త): డి.హీరేహాల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున మకాశి వెంకటేశులు పోటీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, సహకారంతో ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలనే లక్ష్యంతో పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటానన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామ ప్రజలు తనకు మద్దతు తెలిపి గెలిపించాలని మకాశి వెంకటేశులు విజ్ఞప్తి చేశారు.

శ్రీ బాబా అన్వరానంద విద్యాలయంలో వేడుకగా బాలల దినోత్సవం

-- అలరించిన చిన్నారుల దేశ నేతల వేషధారణలు



కళ్యాణదుర్గం, నవంబర్ 14 సీమవార్త కళ్యాణదుర్గం పట్టణంలోని శ్రీ బాబా అన్వరానంద విద్యాలయంలో నవంబర్ 14 చాచా నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయం కరెస్పాండెంట్ శాంతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాఠశాల కమిటీ జాయింట్ సెక్రెటరీ లింగప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, అధ్యాపక బృందం పాల్గొన్నారు. సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, భావి భారత పౌరులను విలువలతో కూడిన విద్యా బోధన ద్వారా తీర్చిదిద్ది దేశ భవిష్యత్తుకు బాల్యం నుండి పునాదులు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడలలో విజేతలకు బహుమతులను పంచిపెట్టారు. అనంతరం చిన్నారులు దేశ నాయకులు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, భారత సైనికుడు, పురాణ పురుషుడు శ్రీరామ్ వేషధారణలలో అలరించారు. నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయి పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, విద్యాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బొంబాయి రమేష్ నాయుడు కార్యకర్తలతో సమావేశం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలకు పిలుపు

యాడికి నవంబర్ 14 (సీమ వార్త) యాడికి మండలంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ బొంబాయి రమేష్ నాయుడు కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే పంచాయతీ ఎన్నికలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా ఉండాలని, పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసేందుకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులందరూ కలిసికట్టుగా పనిచేస్తూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లో సమష్టిగా ముందుకు సాగాలని సమావేశంలో తెలియజేశారు ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటపల్లి అంగన్వాడీ కేంద్రాలలో ఘనంగా బాలల దినోత్సవం.....



తనకల్లు, నవంబర్ 14 సీమ వార్త న్యూస్.. తనకల్లు మండల పరిధిలోని కోటపల్లి గ్రామములో అంగన్వాడీ కేంద్రం 1,2 లలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. అంగన్వాడీ టీచర్స్ సాయి లక్ష్మి, భాగ్యమ్మ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డే కార్యక్రమం ఎంతో గొప్పగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు మన దేశ మాజీ ప్రధాన మంత్రి నెహ్రూ పుట్టినరోజు కాబట్టి ఆయనకు పిల్లంటే చాలా ఇష్టం కాబట్టి ఈ రోజును బాలల దినోత్సవం జరుపుకుం న్నమ్మన్నారు. చిన్న పిల్లలకు నెహ్రూ చిత్ర పటాలు ఇచ్చి వారి చేసిన గొప్ప కార్యక్రమాలు గురించి వివరించడం జరిగింది. చాచాకి జై, జై నెహ్రూ అంటూ పిల్లలు జేజేలు కొట్టారు. పిల్లలకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ స్కూల్ పిల్లలు హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు

బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన రోటరీ క్లబ్,ఇన్నర్ వీల్ క్లబ్.



హిందూపురం: నవంబర్ 14 సీమ వార్త.బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ హిందూపురం, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు మొత్తం 10 రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ నామినీ మాధవరెడ్డి, మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి సర్వతోముఖ అభివృద్ధికి తోడ్పడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల నుంచి లభించిన స్పందన ఎంతో ఆనందాన్ని కలిగించిందని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాలల నవ్వుల్లోనే సమాజ భవిష్యత్తు దాగి ఉందని అన్నారు. ప్రతిభకు ప్రోత్సాహం అందించడమే నిజమైన సేవ అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నరేంద్రరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కార్యదర్శి విజయ్ కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, కార్యదర్శి స్వాతి విజయ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు,రోటరీ, ఇన్నర్ వీల్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల భోజనంలో రాజీ పడొద్దు.

- దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

- కస్తూర్బా బాలికల పాఠశాలలో తనిఖీ-ఏడి జె.



హిందూపురం: నవంబర్ 14 సీమ వార్త. విద్యార్థులకు భోజన విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడవద్దని అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన నిత్యవసరాలు, పాలు, తరగతి గదులు తదితర వాటిని తనిఖీ చేశారు. విద్యార్థులకు సంబంధించి ఆహార పదార్థాలను వండేందుకు అవసరమైన నిత్యావసరాలను ఎలా కొనుగోలు చేస్తున్నారు, నీటి సరఫరా, విద్యాభ్యాసం తదితర అంశాలను ప్రిన్సిపాల్ మాధవితో అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా నిత్యవసరాలను సైతం న్యాయమూర్తి పరిశీలించారు. దీనికి తోడు విద్యార్థులు ఉండే గదుల్లో దోమల బెడద ఉన్నట్లు తెలుసుకున్న న్యాయమూర్తి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నుండి విద్యార్థినిలు రక్షణ పొందేందుకు కిటికీలకు మెష్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి విద్యార్థులకు సంబంధించి శుచి, రుచికరమైన ఆహార పదార్థాలను తయారుచేసి వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, ఏపీపీ అనంత గోపాలకృష్ణ, న్యాయవాది ఆశ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీపీ కి సన్మానం చేసిన సూర్యనారాయణ

-- ఎంపీటీసీ దేవాంగం సోమశేఖర్ కు సత్కారం



సోమందేపల్లి నవంబర్ 14 సీమ వార్త ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికలలో కూటమి తరుపున గెలిచిన జడ్పీటీసీ జయంతి సిద్దలింగప్ప, ఎంపీపీ అభ్యర్థి నీరుగంటి చంద్రశేఖర్ కు శనివారం సన్మానం చేశారు. టీడీపీ నాయకులు సూర్యనారాయణ సోమందేపల్లిలోని టీడీపీ టీడీపీ కార్యాలయంలో జడ్పీటీసీ, ఎంపీపీ సిద్దలింగప్ప, నీరుగంటి చంద్రశేఖర్, ఎంపీటీసీ సోమశేఖర్ లకు పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, ఈ కార్యక్రమంలో కోళ్లప్ప, పెయింటర్ రామాంజినేయులు, జనసేన వరలక్ష్మి, సజ్జరాయుడు, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో గోరంట్ల విద్యార్థి విన్.



గోరంట్ల నవంబర్ 14 సీమ వార్త భువన విజయం ఆడిటోరియం పెనుకొండలో నియోజకవర్గం స్థాయిలో ఏర్పాటు చేసిన స్వీప్ ఓటర్ల అవగాహనా కార్యక్రమంలో ఆర్డిఓ ఆధ్వర్యంలో వ్యాసరచన మరియు క్విజ్ కార్యక్రమంలో ఎస్వీవీఎం డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు పాల్గొనగా అందులో క్విజ్ కాంపిటీషన్స్ నుంచి శ్రావణి సెలెక్ట్ అయ్యారు ఇక్కడ సెలెక్ట్ చేసిన వారిని జిల్లా స్థాయిలో త్వరలో జరిగే కాంపిటీషన్స్ లో పాల్గొంటారని నిర్వాహకులు తెలియజేశారు. జిల్లా స్థాయికి సెలక్ట్ అయిన వారిని ఆర్డిఓ, తాసిల్దార్ , ఎంఈఓ మరియు రెవెన్యూ సిబ్బంది వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో పాటు పిఓ బాలమోహన్ హాజరయ్యారు.

చిలకం మధు ను కలిసిన... గోరంట్ల జడ్పీటీసీ సునేత్ర అనిల్ యాదవ్.

... పాల్గొన్న గోరంట్ల జనసైనికులు.



గోరంట్ల నవంబర్ 14 సీమ వార్త ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో గోరంట్ల మండల జడ్పీటీసీగా అఖండ విజయం సాధించిన సునేత్ర అనిల్ యాదవ్ నేడు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పుట్టపర్తి జడ్పీటీసీ చిలకం మధుసూదన్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గోరంట్ల జడ్పీటీసీ ఎన్నికల్లో తన విజయానికి సహకరించి, గోరంట్ల జనసేన పార్టీకి అండగా నిలిచిన చిలకం మధుసూదన్ రెడ్డి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే పుట్టపర్తి జడ్పీటీసీగా విజయం సాధించిన చిలకం మధుసూదన్ రెడ్డి కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి సురేష్, ఉమ్మడి అనంతపురం జిల్లా సంయుక్త కార్యదర్శి చిలమత్తూరు వెంకటేష్, వీర మహిళ కావేరి, మండల నాయకులు దేవులచెరువు రమేష్, జయకృష్ణ. తదితరులు పాల్గొన్నారు

కాదలూరు సర్పంచ్ అభ్యర్థిగా ఎం. తిప్పారెడ్డి



డి.హీరేహాల్ (సీమవార్త): కాదలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానానికి టీడీపీ తరఫున ఎం. తిప్పారెడ్డి పోటీ చేయనున్నట్లు తెలిపారు. కాదలూరు మోహన్‌రెడ్డి సహకారంతో ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతానని తెలిపారు. సర్పంచ్‌గా తనకు అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎన్నికల్లో గ్రామ ప్రజలు తనకు సహకరించి, మద్దతు అందించాలని ఎం. తిప్పారెడ్డి విజ్ఞప్తి చేశారు.

నంబులపూలకుంట పంచాయతీ ఎన్నికలకు వేడెక్కిన రాజకీయం....





నంబులపూలకుంట :నవంబర్ 14 (సీమవార్త): నంబులపూలకుంట మండలంలో పంచాయతీ ఎన్నికలకు సర్పంచ్ గా అభ్యర్థులు పోటా పోటీగా సిద్ధం కావడంతో రాజకీయం వేడెక్కుతుంది. ప్రతి పంచాయతీలో సర్పంచ్ ఎన్నికలకు బరిలో పోటీ చేయ చుండగా ఈ ఎడాది పంచాయతీ సర్పంచుకు పోటీ చేయడానికి అభ్యర్థులు భిన్నంగా సిద్ధమ వుతున్నారు, దీంతో గ్రామాల్లో రాజకీయ వేడి మొదలైంది. సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులు ఇప్పటికే ఓటర్ల దగ్గర వెళ్లి తమను గెలిపించాలని ప్రచారం ముమ్మరంగా మొదలుపెట్టారు. నంబుల పూలకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ గా పోటీ చేసేందుకు అభ్యర్థి సిద్ధమయ్యారు. ఎన్ పికుంట గ్రామ సర్పంచ్ పోటీగా మండెంవారి పల్లి కి చెందిన రమణ శనివారం గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. మండే వారిపల్లి కి చెందిన రమణ సొంత గ్రామం నుంచి ప్రజలు మద్దతుగా నిలిచారు. దీంతోమొదటగా సర్పంచ్ గా పోటీ ప్రచారానికి నంబుల పూలకుంటలోని నల్ల గంగమ్మ ఆలయం వద్దకు వెళ్లి అమ్మవారికి అతను ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొంది ఆలయం నుంచి ప్రజల వెంట ప్రధాన వీధిలో ప్రచారం మొదలుపెట్టారు.

ప్రొద్దుటూరులో మంత్రి కందుల దుర్గేష్‌కు ఘన స్వాగతం..

పలువురు ప్రముఖుల మర్యాదపూర్వక భేటీ



ప్రొద్దుటూరు, నవంబర్ 14, (సీమవార్త): రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, జనసేన నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రొద్దుటూరుకు వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌ను కొవ్వూరు గ్రాండ్‌లో ఎమ్మెల్యే సంధ్యాల వరదరాజుల రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, చౌటపల్లె లక్ష్మిరెడ్డి, జనసేన నాయకులు సుంకర మురళి, మాదాసు మురళి, శ్రీరామ వంశీ, శ్రీనివాసుల రెడ్డి, చిరంజీవి, చెన్నయ్య తదితరులు మంత్రిని కలిశారు. అదేవిధంగా జనసేన పార్టీ స్థానిక ఎన్నికల సమన్వయకర్త మాదాసు మురళి, పార్టీ నాయకుడు శ్రీరామ వంశీ మంత్రిని కలిసి మర్యాదపూర్వకంగా అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆహ్వానం మేరకు మంత్రి ఆయన నివాసానికి వెళ్లారు. గతంలో ఉభయ గోదావరి జిల్లాలు, ఏలూరు జిల్లాల్లో జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసిన సమయంలో ఏర్పడిన పరిచయాల నేపథ్యంలో కమిషనర్ కుటుంబ సభ్యులతో మంత్రి ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్, ఆయన సతీమణి శైలజ, కుమారుడు డాక్టర్ సాందీప్ మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి రాకతో కమిషనర్ నివాసంలో సందడి నెలకొంది.

వికసిత్ భారత్‌కై....యూత్ మైండ్ సెట్ పెరగాలి..!!

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువత ఆలోచనలు, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మేరా యువ భారత్ పోర్టల్ ద్వారా నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027 క్విజ్, వ్యాసరచన పోటీలలో అర్హత సాధించిన అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన యువతకు తదుపరి దశగా వికసిత్ భారత్ చాలెంజ్ ట్రాక్‌లో భాగంగా ఈ జిల్లా స్థాయి పీపీటీ ప్రెజెంటేషన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 12 మంది యువతను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన యువతకు జనవరిలో దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027 కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. అక్కడ దేశ ప్రధానమంత్రి సమక్షంలో వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సంబంధించిన తమ వినూత్న ఆలోచనలు, సూచనలను దేశ స్థాయిలో పంచుకునే అరుదైన అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో తమ ఆలోచనలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ ఏ. మాలోల, జిల్లా పర్యాటక అధికారి శ్రీ రమణ రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డా. జి. మమత, సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఓ. ప్రణతి, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. పి. సత్య సౌమ్య వ్యవహరించారు. కార్యక్రమంలో పాల్గొన్న యువతకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ వాలంటీర్లు బి. అంబరీష్, ఐ. సాయి కార్తిక్, బి. రాము, ప్రవీణ్ నాయక్, డి. వినుత, యాసీర్, ఆన్సెట్ సిబ్బంది, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరు కు వ్యూహ రచన..!!

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా జయలక్ష్మి గారిని ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, నిరంతరం ప్రజాసేవలో భాగమవ్వాలని సూచించారు. ఈ సమావేశాలలో ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు బడ్జెట్లు.. అవే హామీలు.. అమలెక్కడ?..

ఆరు గ్యారంటీల వైఫల్యాలపై రాహుల్‌కు హరీశ్‌రావు ప్రశ్నలు!

హైదరాబాద్ : కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయహస్తం'పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని పలు ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం అమలవుతున్న పథకాలకు పొంతన లేదని ఆరోపించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ మూడేళ్లలో రూ.5 వేల కోట్ల లోపే కేటాయించారని ఆరోపించారు. విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం వాటా కల్పిస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఒక్క శాతం కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో భాగంగా పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించే 'అంబేడ్కర్ అభయహస్తం' పథకాన్ని ప్రకటించారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు 31 శాతం వాటా కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ రెండు హామీల అమలులోనూ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. యూత్ డిక్లరేషన్‌లో భాగంగా 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు. కానీ ఇప్పటివరకు 10 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఆశించిన ప్రయోజనం అందలేదని విమర్శించారు. విద్యార్థులకు రూ.5 లక్షల 'విద్యా భరోసా కార్డు' ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. మైనారిటీ డిక్లరేషన్‌లో భాగంగా రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు రూ.వెయ్యి కోట్ల లోపే కేటాయించారని ఆరోపించారు. ఇలా ప్రతి వర్గానికి ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'అబద్ధాలు.. పచ్చి అబద్ధాలు..

విద్యార్థి దశ నిర్ణయాలే భవిష్యత్తుకు పునాది.





- లక్ష్యసాధనకు పట్టుదలతో శ్రమించాలి

-అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు.

హిందూపురం: నవంబర్ 14 సీమ వార్త. విద్యార్థి దశ నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయని అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు సూచించారు. మంచి నిర్ణయాలు తీసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సురక్షిత్ బచ్ పన్ అభియాన్ లో భాగంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థి దశ లో మంచి నిర్ణయాలు తీసుకుని మంచి వ్యక్తులతో స్నేహం చేయడం వల్ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఎంతో ఉన్నత ఆశయంతో పాఠశాలలకు విద్యాభ్యాసం నిమిత్తం పంపిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత ఆశయంతో చదివి నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి విద్యార్థికి లక్ష్యం అవసరమన్నారు. అదే విధంగా 14 సంవత్సరాల లోపు బాలికలకు ఎక్కడైనా వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. చట్టరీత్యా బాల్య వివాహాలను నిషేధించడం జరిగిందన్నారు. దీనికి తోడు 14 సంవత్సరాల లోపు బాల బాలికలందరూ తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉంటూ చదువుకోవాలన్నారు. ఎక్కడైనా విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులు ఉంటే వెంటనే తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. విద్యార్థి దశలో ఆకర్షణలకు లోను కాకుండా మంచి ఆలోచనలతో భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. అనంతరం బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. కాగా కస్తూరిబా పాఠశాలకు అవసరమైన మైక్ ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వితరణ చేయనున్నట్లు అధ్యక్షులు సుదర్శన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ఏపీపీ గోపాలకృష్ణ, న్యాయవాది ఆశ, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి, పారా లీగల్ వాలంటీర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూచిరాజ్ పల్లి లో సంపూర్ణ మద్యపాన నిషేధం

గ్రామ కమిటీ ప్రజలందరి సమక్షంలో ఏకగ్రీవ తీర్మానం

కమాన్ పూర్ : మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు కూచిరాజ్ పల్లిలో గ్రామ ప్రజలందరి సమక్షంలో శనివారం గ్రామ కమిటీ పెద్దలు, పార్టీలకు అతీతంగా ఏక పక్ష నిర్ణయం తీసుకొని వారి ఆధ్వర్యంలో సంపూర్ణ మద్యపాన నిషేధం విధించారు. గ్రామ కమిటీ తీర్మానం, నిబంధనకు కట్టుబడి ఎవ్వరు కూడా బెల్టు షాపులు నిర్వహించవద్దని వారు ఏకగ్రీవ తీర్మానం చేసి, మంథని ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం కూడా అందజేసి సహకారం అందించాల్సిందిగా ఎక్సైజ్ సిబ్బందిని వారు కోరారు. గ్రామంలో బెల్టు షాపులు నిర్వహించడం వల్ల ప్రజలు మద్యానికి బానిసై గ్రామంలో ఉన్న యువత, ప్రజలు, మహిళలు సైతం మద్యానికి బానిసై, విచక్షణ, ఆలోచన జ్ఞానాన్ని మరిచి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ, పెడదారి పడుతున్నారని వారు అన్నారు. బెల్టు షాపుల్లో అమ్మే కల్తీ మద్యాన్ని సామాన్య ప్రజలు సేవించడం వల్ల వారి ఆరోగ్యం చెడిపోతుందని, రోజంతా కూలి పని చేసుకొని సంపాదించిన డబ్బులను కుటుంబ పోషణకు వాడకుండా, తాగుడుకు ఖర్చు పెడుతూ ఆర్థికంగా సైతం నష్టపోతున్నారని వారు అన్నారు. గ్రామంలో ముఖ్యంగా ఈ బెల్ట్ షాపులు నిర్వహించడం వల్ల మద్యం రాత్రి, పగలు తేడా లేకుండా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడంతో విపరీతంగా మద్యం తాగుతూ కుటుంబాల్లో గొడవలకు కూడా దారి తీస్తున్నాయి. ఈ సమస్యలు అన్నింటిని దృష్టిలో ఉంచుకొని బెల్ట్ షాపులను సహించే ప్రసక్తి లేదన్నారు. గ్రామ కమిటీ నిబంధనలు అతిక్రమించి గ్రామంలో ఎవరైనా మద్యం అమ్మినచో, మద్యం షాపుల దగ్గర వెళ్లి మద్యం సేవించిన ఎడల వారిపై లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని గ్రామ కమిటీ తీర్మానం చేశారు. ఆ జరిమానా డబ్బులను గ్రామ అభివృద్ధికి వినియోగిస్తామని వారు తెలిపారు. అంతేకాకుండా ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించి చట్టరీత్యా చర్యలు సైతం తీసుకోవడం



జరుగుతుందని గ్రామ ప్రజలందరూ హెచ్చరించారు. కావున గ్రామ ప్రజలందరి మేలు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేసిన నిర్ణయానికి ప్రజలందరూ ఈ నిబంధనలకు కట్టుబడి సహకరించాలని గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి రాజయ్య సభ్యులు కామణి రమేష్, మాదేశి శ్రావణ్ కుమార్, అంబటి నర్సింగ్, మిట్టపల్లి కిషోర్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు నాగేల్లి జానీ, సామాజిక సేవకుడు దూడపాక శ్రీధర్, నక్క వివేక్, అంబటి కొమురయ్య, అంబటి సదానందం, లోడీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ మాదేశి పద్మ, యూత్ సభ్యులు అంబటి సాయి, దాసరి కుమార్, కామణి వెంకటేష్, వేముల మధు, కామణి పవన్, మిట్టపల్లి సాయి, మాదేశి మహేష్ కుమార్ పాల్గొన్నారు..

గ్రీస్ నుంచి తిరిగొచ్చి.. చెరకుతో కోట్లు పండిస్తున్న పంజాబ్ యువ రైతు

గ్రీస్‌లో 8 ఏళ్లు పనిచేసి స్వగ్రామానికి తిరిగి వచ్చిన హర్‌గుర్‌జిత్ సింగ్

సంప్రదాయిక పంటలు వదిలి చెరకు సాగుతో ఏటా రూ. 2 కోట్ల టర్నోవర్

అధునాతన పద్ధతులతో తక్కువ విత్తనం, నీటితో అధిక దిగుబడి సాధన

వ్యవసాయ యంత్రాలతో ఇతర రైతులకు సేవలు అందిస్తూ అదనపు ఆదాయం

బహుళ ఆదాయ మార్గాలతో వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చిన వైనం



జలంధర : చదువు పూర్తి కాగానే మంచి భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్లడం చాలామంది యువత కల. కానీ, విదేశాల్లో సంపాదించిన అనుభవాన్ని, సంపాదనను మూలధనంగా మార్చి, స్వదేశానికి తిరిగి వచ్చి ఇక్కడి మట్టిలోనే బంగారం పండించాలని కొందరే అనుకుంటారు. అలాంటి అరుదైన యువకుడి కథే ఇది. గ్రీస్‌లో ఎనిమిదేళ్లు పనిచేసి, తిరిగివచ్చి పంజాబ్ నేలపై వ్యవసాయాన్ని లాభాల పండుగగా మార్చిన హర్‌గుర్‌జిత్ సింగ్ మిన్హాస్ (36) విజయగాథ ఎందరికో స్ఫూర్తిదాయకం. గ్రీస్ నుంచి పంజాబ్ పొలానికి..: పంజాబ్‌లోని జలంధర్ జిల్లా దరోలి కలాన్ గ్రామానికి చెందిన హర్‌గుర్‌జిత్, 12వ తరగతి పూర్తవగానే ఉపాధి కోసం గ్రీస్‌కు వెళ్లారు. అక్కడ సుమారు ఎనిమిదేళ్ల పాటు వ్యవసాయ రంగంలోనే పనిచేశారు. విదేశీ అనుభవం ఆయనలో కొత్త ఆలోచనలకు బీజం వేసింది. ఐదేళ్ల క్రితం పంజాబ్‌కు తిరిగి వచ్చిన ఆయన, తన కుటుంబానికి చెందిన భూమిలో వ్యవసాయం చేయాలని నిశ్చయించుకున్నారు. అయితే, అందరిలాగా గోధుమ, వరి వంటి సంప్రదాయ పంటల వెంట పరుగెత్తలేదు. తనకున్న విదేశీ అనుభవానికి, వ్యవసాయంపై మరింత పట్టు సాధించడానికి డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ కోర్సు పూర్తిచేశారు. ఆ తర్వాత తన ప్రస్థానాన్ని చెరకు సాగుతో ప్రారంభించారు. ఆధునాతన సాగు.. బహుళ ఆదాయం: ప్రస్తుతం హర్‌గుర్‌జిత్ తనకున్న 12 ఎకరాల సొంత భూమితో పాటు, మరో 48 ఎకరాలను ఎకరాకు ఏటా రూ. 35,000 అద్దెకు తీసుకుని మొత్తం 60 ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారు. ఇందులో 35 ఎకరాలు శరదృతువు నాట్లు కాగా, 25 ఎకరాలు వసంత రాటూన్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. కేవలం చెరకుపైనే ఆధారపడకుండా, అందులో అంతర పంటలుగా గోధుమ, పెసలు, ఆవాలు వంటి 7-8 రకాల పంటలు పండిస్తూ అదనపు ఆదాయం గడిస్తున్నారు. ఆయన అనుసరిస్తున్న ట్రెంచ్ పద్ధతి, సింగిల్-ఐ బడ్ టెక్నిక్ వల్ల విత్తన చెరకు ఖర్చు గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఎకరానికి 30 క్వింటాళ్ల విత్తనం అవసరమైతే, ఈ పద్ధతిలో కేవలం 1.5 క్వింటాళ్లతోనే సరిపోతుంది. అంతేకాదు, పరితో పోలిస్తే నీటి వినియోగం కూడా సగానికి సగం తక్కువ అని ఆయన గర్వంగా చెబుతారు. ఈ ప్రణాళికతో సొంత భూమిలో ఎకరాకు రూ. 76,000, లీజుకు తీసుకున్న భూమిలో రూ. 41,000 నికర లాభం ఆర్జిస్తున్నారు.

సాగు నుంచి వ్యాపార స్థాయికి..:

హర్‌గుర్‌జిత్ కేవలం రైతుగానే ఆగిపోలేదు, తన ఆలోచనలను వ్యాపారంగా మలిచారు. రూ. 2 కోట్ల భారీ పెట్టుబడితో చెరకు కోత యంత్రం (హార్వెస్టర్), ట్రాలీలు, ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. దీనికి ప్రభుత్వం నుంచి రూ. 36 లక్షల సబ్సిడీ కూడా లభించింది. ఈ యంత్రాలతో తన పొలంలో పనులు పూర్తి చేయడమే కాకుండా, చుట్టుపక్కల రైతులకు కోత, రవాణా సేవలు అందిస్తూ మరో ఆదాయ మార్గాన్ని సృష్టించుకున్నారు. గత సీజన్‌లో 45,000 క్వింటాళ్ల చెరకును కోత కోయగా, ఈ ఏడాది ఏకంగా లక్ష క్వింటాళ్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. నేడు హర్‌గుర్‌జిత్ చెరకు ఆధారిత వ్యవసాయ వ్యాపారం ద్వారా ఏటా రూ. 2 కోట్లకు పైగా టర్నోవర్ సాధిస్తూ, సుమారు రూ. 60-65 లక్షల నికర లాభాన్ని ఆర్జిస్తున్నారు. సంప్రదాయిక పంటలతో పోలిస్తే ప్రణాళికాబద్ధంగా చెరకు సాగు చేస్తే మూడు రెట్లు అధిక లాభం పొందవచ్చని ఆయన అనుభవం రుజువు చేస్తోంది. విదేశాలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్న యువతకు, వ్యవసాయం దండగ అనే నిరాశలో ఉన్న రైతులకు హర్‌గుర్‌జిత్ సింగ్ మిన్హాస్ ఒక ఆశాకిరణం అనడంలో సందేహం లేదు.